
సామాజిక, రాజకీయ పక్షపత్రిక

10 ఫిబ్రవరి 2017
పేజీలు : 36
వెల : 10/-

# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల




# అంత్యోదయ స్ఫూర్తితో కేంద్ర బడ్జెట్

# G.NARAYANAMMA INSTITUTE OF TECHNOLOGY & SCIENCE FOR WOMEN

Estd: 1997

SPONSORED BY G. PULLA REDDY CHARITIES TRUST, HYDERABAD
AFFILIATED TO J N T U H & APPROVED BY A. I. C. T. E
AN ISO 9001: 2008 CERTIFIED INSTITUTION AND ACCREDITED BY NAAC

**Shaikpet, Hyderabad – 500 104.**
**Ph: 23565648/49. Fax: 040 23564187**
**Website: www.gnits.ac.in, email: principal@gnits.ac.in**

## COURSES OFFERED

1. Electronics & Communication Engg.,
2. Computer Science & Engg.,
3. Electrical & Electronics Engg.,
4. Information Technology
5. Electronics & Telematics Engg.,
6. M.Tech in Power Electronics & Electric Drives
7. M.Tech in Computer Science & Engineering
8. M.Tech in Digital Electronics & Communication Systems
9. M.Tech in Computer Networks & Information Security
10. M.Tech in Wireless & Mobile Communications



## OTHER INSTITUTIONS RUN BY THE TRUST

1. G.Pulla Reddy Engineering College, Kurnool.
2. G.Pulla Reddy College of Pharmacy, Mehdipatnam, Hyderabad.
3. G.Pulla Reddy Degree & PG College, Mehdipatnam, Hyderabad.
4. G.Pulla Reddy Junior College, Abids, Hyderabad.
5. G.Pulla Reddy High School, Mehdipatnam, Hyderabad.
6. G.Pulla Reddy Memorial School, Dislukhnagar, Hyderabad.
7. G.Pulla Reddy Government Polytechnic, Kurnool
8. G.Narayanamma High School, Mehdipatnam, Hyderabad
9. G.Narayanamma Hospital, Gokavaram, Atmakuru Taluk, Kurnool
10. G.Narayanamma Pulla Reddy Respite Home for Mentally Retarded Women, Kurnool.
11. Vignana Peetham (Orphanage), Kurnool
12. Samskruta Basha Prachara Samithi, Nampally Station Road, Hyderabad.
13. G.Pulla Reddy Dental College & Hospital at Kurnool

**P.Subba Reddy**
**CHAIRMAN**

**G.Raghava Reddy**
**TREASURER**

**Dr.K. Ramesh Reddy**
**PRINCIPAL**


కష్టాలను మరిచిపోవడం, రహస్యాలను దాచిపెట్టడం, అవకాశాలను సద్వినియోగపరచుకోవడం అనే మూడూ నిజంగా కష్టమైనవి. – చిలో

# Swamy Vivekananda Seva Samithi Education Trust

**Since 1988**

## HINDU PUBLIC SCHOOL

**Affiliated to CBSE**

SANATHNAGAR, HYDERABAD-18.Phone:04023704355,23711185
E-mail ID : hindu_pschool88@yahoo.com
Visit us : www.hindupublicschool.com



28 Years of Quality Education

+ Affiliated to CBSE + NCC (Boys & Girls) + ABACUS + IIT + YOGA
+ DANCE + MUSIC + KARATE + ART & CRAFT + SPORTS

## HINDU TECHNO SCHOOL

**Regd. by Govt. of Telangana**

APHB Colony, Opp. IDPL Colony, Chintal, HYDERABAD – 18
Phone : 040 – 23721122, 23079869
E-mail ID : hindutechno1@gmail.com
Vist us : www.hindutechnoschool.com



Building Firm Foundation for Bright Future

+YOGA + DANCE + KARATE + ART & CRAFT + SPORTS

## HINDU JUNIOR COLLEGE FOR GIRLS
## HINDU DEGREE & PG COLLEGE FOR WOMEN

Near Hanuman Devastanam, Sanath Nagar, Hyderabad – 18. Phone : 040 – 65505981
Visit us : www.hinducollegeforwomen.com

Courses Offered for INTERMEDIATE **M.P.C. - Bi.P.C - M.E.C. - C.E.C.**

**B.Sc.**
*Maths, Physics, Computer Science
*Maths, Statistics, Computer Science
*Maths, Chemistry, Computer Science
*Maths, Electronics & Computer Science
*Micro Biology, Chemistry, Computer Application
*Micro Biology, Bio-Technology, Chemistry



**B.Com.** : * Regular * Computers

**M.Com,M.Sc.** : Computer Science * Organic Chemistry

**B. Shyam Sunder Goud**
B.Com., L.L.B.
Managing Trustee
Swamy Vivekananda Seva Samithi Education Trust



# జనసందేశ్

జాతీయ చైతన్య జ్వాల

**సామాజిక, రాజకీయ పక్షపత్రిక**

సంపుటి:27 | సంచిక:06 | 10 ఫిబ్రవరి 2017


## ఈ సంచికలో...


- సమస్తజీవుల సంపూర్ణ కళ్యాణ సాధనలో తొలి అడుగు! ... 5
- నల్లధనానికి వ్యతిరేకంగా ఉద్యమం ... 6
- పండగలా పరీక్షకు సిద్ధమవండి ... 7
- మతపరమైన రిజర్వేషన్లను అడ్డుకోవాలి ... 8
- అంత్యోదయ స్ఫూర్తితో కేంద్ర బడ్జెట్ ... 9
- వేతన జీవులకు ఊరట ... 15
- దేశ భవితకు బాటలు ... 18
- కేరళలో బిజెపి కార్యకర్తలపై హత్యాకాండ ... 20
- సవాలుకు సిద్ధం: వాజ్‌పేయి ... 21
- హాఫిజ్ సయీద్ - పాకిస్థాన్ హౌదినీ ఇంద్రజాలం ... 22
- క్షేత్రం ఏదైనా మన లక్ష్యం ఒకటే! ... 23
- పాలకుల పాపం ఉస్మానియాకు శాపం ... 24
- ప్రతిభకే పద్మా పురస్కారం ... 26
- దళితులను వంచిస్తున్న కేసీఆర్ ... 28
- రైతుల ఆత్మహత్యలు పట్టని టీఆర్ఎస్ ప్రభుత్వం! ... 30
- రుపాయికి కిలో బియ్యం ఎన్డీఏ పుణ్యమే ... 31
- మోదీ "ఘన తంత్రం" ... 32
- టీఆర్ఎస్ వైఫల్యాలపై ఉద్యమిద్దాం! ... 33
- మారనున్న దేశ ఆర్థిక ముఖచిత్రం ... 34



మీ వార్తలు, సంబంధిత ఫోటోలు (ఫోటోలోని వారి పేర్లు, బాధ్యతలతో సహా) మెయిల్‌ద్వారా కూడా జనసందేశ్‌కు క్షణాల్లో పంపించవచ్చు. మీరు పంపవలసిన చిరునామా (ఈ-మెయిల్): janasandesh@yahoo.co.in
janasandeshmag@gmail.com
Phone No :040 24650866



Editor, Printer & Publisher : **MANTHRI SRINIVASULU**
on behalf of Bharateeya Janata Party and
Printed at Kala Jyothi Process Pvt. Ltd., RTC 'X' Roads, Hyderabad.
Published at: Dr.Shyam Prasad Mukharji Bhavan,
Opp: Exhibition Grounds, Nampally, Hyderabad - 500 001.




# సంపాదకీయం

## సమస్తజీవుల సంపూర్ణ కళ్యాణ సాధనలో తొలి అడుగు!

సాధారణ అవగాహన, అంచనాలకు భిన్నమైన బడ్జెట్‌ను ఈ ఏడాది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

స్వతంత్ర భారతావని పాలనా పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాలు రూపొందించిన బడ్జెట్ల ఒరవడి ఎన్నికల ప్రయోజనాల దృష్టితోనే సాగింది. దాంతో జమా ఖర్చులు, మిగుళ్ళు, తగుళ్ళు, వివిధ రంగాలకు కేటాయింపులే ప్రభుత్వ బడ్జెట్ అనే అవగాహన జనంలో ఏర్పడింది.

రాజకీయ వాది రేపటి ఎన్నికల గురించి ఆలోచిస్తే రాజనీతిజ్ఞుడు రేపటి తరం గురించి ఆలోచిస్తాడన్న నానుడి బలపడి కాంగ్రెస్‌లో రాజనీతిజ్ఞత లోపించిందని జనం తేల్చేశారు.

మోదీని రాజకీయ వాదిగా తలపోసిన వారు పంజాబ్ తదితర ఐదు రాష్ట్రాల ఎన్నికల దృష్టితోనే ఈ ఏడాది కేంద్రప్రభుత్వ బడ్జెట్ ఉండొచ్చని ఊహాగానాలు వినిపించారు.

మోదీ గొప్ప అభివృద్ధి సాధకుడని భావించిన వారు ఆయన చేపట్టిన పెద్దనోట్ల రద్దు చర్య ఫలితంగా బ్యాంకుల్లో పోగుపడ్డ కోట్లాది రూపాయలతో అభివృద్ధి సాధన దిశగా అడుగులు వేస్తాడని ఊహించారు.

అభివృద్ధి విషయమై ప్రధాని మోదీ అభిప్రాయాలు స్పష్టంగా ఉన్నాయి. 'సబ్‌కా వికాస్ సబ్‌కా సాత్' అందరికీ, అన్నింటా అభివృద్ధి అన్న నినాదంలోనే ఆయన ప్రభుత్వ విధానం స్పష్టం!

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓట్ల పూలు రాల్చే చెట్లుగా ఇంతకాలం పాలకులు భావించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ సకమ్రంగా అందాలంటే పంక్తి చివరి వానినుండి అభివృద్ధి ఫలాల వడ్డన మొదలెట్టాలంటుంది 'అంత్యోదయ' భావన.

అభివృద్ధి అంతటా సాధ్యం కావాలంటే వ్యవసాయం ప్రధాన ఆదాయ వనరు అయిన భారత దేశంలో వ్యవసాయ దారుల వృత్తికి ఊతమివ్వాలి.

కేవలం రెక్కల కష్టంతో పొట్టపోసుకునే కూలివాడైనా, సేద్యగాడైన రైతు అయినా కష్టజీవి అయిన పేదవాడికి ఆరోగ్యమే మహాభాగ్యం.

మారుమూల పల్లెల్లో సైతం నూతన ఆసుపత్రుల నిర్మాణము, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, వస్తుసేవలు తదితరాలతో కూడిన వైద్యరంగానికి ఈ ఏడాది బడ్జెట్‌లో జరిగిన కేటాయింపుల్లో అంశాల వారీగా కనిపిస్తున్న భారీ పెరుగుదల చూసి దీన్ని పేదల ఆరోగ్య పరిరక్షణ బడ్జెట్‌గా పేర్కొంటున్న విశ్లేషణల్లో అంత్యోదయ ఆరంభమైందని ధ్వనిస్తోంది!

వ్యవసాయం గిట్టుబాటు కాదని దిగులు చెందుతున్న రైతులకు ఊరట కలిగిస్తూ రుణాలపై వడ్డీలో కొంత మాఫీ, ఎరువులు తదితరాలపై నేరుగా లబ్ధిదారులకే రాయితీ ప్రయోజనాలు అందజేసే విధాన మార్పులతో పాటు భారీగా పెరిగిన కేటాయింపులను చూసి ఇది అన్నదాతలను ఆదుకునే బడ్జెట్ అని శ్లాఘిస్తున్నారు.

అన్నదాతలకు అండనిలుస్తూ, అంత్యోదయ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ బిజెపి తన సిద్ధాంత మార్గంలో స్థిరంగా సాగుతున్నదని స్పష్టం చేస్తున్నది.

పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవ దర్శనం సమస్త జీవులకు సంపూర్ణ కళ్యాణ సాధనా మార్గం. దాన్ని మౌలిక సిద్ధాంతంగా స్వీకరించింది బిజెపి.

అంత్యోదయతో ఆరంభమైన బడ్జెట్ ప్రయాణం రానున్న సంవత్సరాల్లో సమస్తజీవులకు సంపూర్ణ కళ్యాణం అనే మహత్తర లక్ష్యం దిశగా సాగాలని కోరుతూ అందుకు తగిన మద్దతు అందించడానికి దేశప్రజలు సిద్ధంగా ఉన్నారు. దేశప్రజల మద్దతు సంపాదించడంలో భారతీయ జనతా పార్టీ సఫలం కావాలని, పండిత దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవ దర్శన సాకారంలో మోదీ ప్రభుత్వం విజయం సాధించగలదని ఆశిద్దాం!




# నల్లధనానికి వ్యతిరేకంగా ఉద్యమం

ఎన్నికల సంస్కరణలు, రాజకీయాల్లో సత్‌ప్రవర్తన, నల్లధనానికి వ్యతిరేకంగా ఎన్.డి.ఏ. ప్రభుత్వం త్వరలో ఉద్యమం ప్రారంభిస్తుందని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రకటించారు. రాజకీయాలలో సత్‌ప్రవర్తన కోసం బిజెపి ఇతర రాజకీయ పార్టీలకన్నా ముందు ఉంటుందని జనవరి 10న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం మీద రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ ఈ విషయం చెప్పారు. 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సంపూర్ణ వాఙ్మయం గ్రంథాన్ని ఇంతకుమందే దిల్లీలో ప్రధానమంత్రి మోదీ, అమిత్ షా ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని వివిధ రాష్ట్రాల రాజధానుల్లో ఆవిష్కరిస్తున్నారు.

మోదీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాలు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయకు అనుకూలమైనవేనని షా అన్నారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శతజయంతిని పేదల సంక్షేమ సంవత్సరంగా జరపాలని ప్రధానమంత్రి నిర్ణయించారు. పార్టీని నడపడానికి దీన్‌దయాళ్ పటిష్టమైన పద్ధతులు రూపొందించినందువల్లే సామాన్య కార్యకర్తనైన తాను దేశంలోకెల్లా అత్యంత పెద్ద పార్టీకి అధ్యక్షుడిని కాగలిగానని షా చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినందుకు కొనియాడుతూ కొంతమంది దీన్ని పేదల వ్యతిరేక చర్య అంటున్నారని విమర్శించారు. నిజానికి ఇది సంపన్నులను వారిని సంతృప్తి పరచడానికి కాదని 80 కోట్ల మంది పేద ప్రజలకు ఉపయోగపడేది అని అన్నారు. ఇది పన్నుల ఎగవేతను అరికట్టడానికి తోడ్పడుతుందని చెప్పారు.

రాజకీయాలలో సత్‌ప్రవర్తనపై, రాజకీయాలలో నల్లధనం పాత్రపై చాలా చర్చ జరిగిందని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం ఈ రుగ్మతలనన్నింటినీ అంతమొందించడానికి ఒక ఉద్యమం నిర్వహిస్తోందని తెలియజేశారు. డబ్బు ఖర్చు లేకుండా ఎన్నికలు నిర్వహించే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు.

పెద్ద నోట్లను రద్దు చేసిన తర్వాత ఎన్నికల సంస్కరణ, రాజకీయాలలో సత్‌ప్రవర్తన నల్లధనం పాత్రను తొలగించే మాటేమిటి అని కొంతమంది ప్రశ్నిస్తున్నారని షా చెప్పారు. అక్రమాలను ఆపడం వల్ల పేదల సంక్షేమానికి డబ్బు ఎక్కువగా అందుబాటులోకి వస్తుందని అయన అన్నారు. విస్తృతమైన ఎన్నికల సంస్కరణలను సూచించడానికి, ఎన్నికల ఖర్చు తగ్గించడానికి, రాజకీయ పార్టీలకు విరాళాలలో దాపరికం లేకుండా చూడడానికి బిజెపి ఇదివరకే ఒక సంఘాన్ని ఏర్పాటు చేసిందని తెలియజేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశ పునర్నిర్మాణం కోసం కాంగ్రెస్ పశ్చిమ దేశాల విధానాలను అనుసరించిందని బిజెపి దేశంలో ఇందివరకే ఉన్న ఉన్నతాదర్శాల ఆధారంగా పునర్నిర్మాణంపై దృష్టి పెట్టిందని ఇదే ఈ రెండు పార్టీల మధ్య తేడా అని షా చెప్పారు.

బిజెపి ఏ వ్యక్తినో దృష్టిలో ఉంచుకుని ఉద్యమాలు చేయదని, పేదలకు సంబంధించిన సమస్యలపైనే ఆందోళనలు చేపడుతుందని షా అన్నారు. ఈ సందర్భంగా ఆయన అయోధ్య ఉద్యమాన్ని, పేదలకు గ్యాస్ సరఫరా చేయడానికి వీలుగా సంపన్నులు గ్యాస్ సబ్సిడీ వదులుకోవడానికి చేపట్టిన ఉద్యమాలను ఆయన ప్రస్తావించారు. బ్యాంకు ఖాతాలు లేని 60 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిపించామని ఆయన అన్నారు. జన్‌ధన్ యోజన కింద ఇప్పటికే 27 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు తెరిచే అవకాశం వచ్చిందని అన్నారు. ప్రధానమంత్రి విజ్ఞప్తి మేరకు ఇప్పటికే 1.37 కోట్ల మంది గ్యాస్ సబ్సిడీ వదులుకున్నారు అవి అయన తెలియజేశారు.

ఈ గ్రంథ ఆవిష్కరణోత్సవానికి గ్రంథ సంపాదకుడు డా. మహేశ్ చంద్ర, ఇందిరా గాంధీ జాతీయ కళా కేంద్రం అధ్యక్షులు రాం బహదూర్ రాయ్ కూడా హాజరయ్యారు.

### గురుగోవింద్ సింగ్‌కు నివాళులు

పాట్నా చేరుకున్న తర్వాత అమిత్ షా పాట్నా సాహెబ్ గురుద్వారా వెళ్లి సిక్కుల పదవ గురువైన గురు గోవింద్ సింగ్‌కు నివాళులర్పించారు. దాదాపు వంద మంది మోటారు సైకిళ్ళు నడుపుతూ అమిత్ షాను విమానాశ్రయం నుంచి తీసుకెళ్లారు. పాట్నాలోని బీర్‌చంద్ పటేల్ మార్గ్‌లో ఉన్న బిజెపి కార్యాలయం వద్ద షా కొద్దిసేపు ఆగారు. అక్కడ ఆయనకు బిహార్ బిజెపి విభాగం అధ్యక్షుడు నిత్యానంద్ రాయ్ స్వాగతం పలికారు. కేంద్ర మంత్రులు రాధా మోహన్ సింగ్, రవిశంకర్ ప్రసాద్, సుశీల్ కుమార్ మోదీ, ఇతర సీనియర్ నాయకులు గ్రంథావిష్కరణ సమావేశానికి హాజర య్యారు.

–జనసందేశ్ ప్రతినిధి




రాజ్యాంగ విరుద్ధంగా ముస్లింలకు మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ బీజేవైఎం తెలంగాణ శాఖ ఫిబ్రవరి 3న ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసింది. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, బీజేవైఎం జాతీయ కార్యదర్శి బద్దం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర హెడ్ క్వార్టర్స్ ఇంచార్జ్ గోపాల్‌జీ, దాసరి శేఖర్, అంబేద్కర్, అనంత కృష్ణ, సంజయ్ ఘనాటే తదితరులు పాల్గొన్నారు.

మనమాట

Mann Ki Baat



# పండగలా పరీక్షలకు సిద్ధమవండి

## విద్యార్థులకు ప్రధాని పిలుపు

**పరీక్షల సీజన్ మొదలైంది. పది, ఇంటర్ నుండి దాదాపు అన్ని తరగతుల విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆకాశవాణిలో ప్రసారమైన 'మన్ కీ బాత్' (మనసులో మాట)లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విద్యార్థులపైనే దృష్టి పెట్టారు. వారిలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు. పరీక్షలను ఓ పండుగలా భావిస్తే ఎలాంటి ఒత్తిళ్లు దరిచేరవన్నారు. జనవరి 29న ప్రసారమైన మన్ కీ బాత్ లోని ముఖ్యాంశాలను ప్రధాని మాటల్లోనే చూద్దాం.**

➢ ఈ సంవత్సరం మీరు రాసే పరీక్షలు.. మీ జీవితాకాలానికి సంబంధించిన పరీక్ష కాదు. జీవితంలో మీ విజయానికి పరీక్షలు మాత్రమే కొలమానం కాదు.

➢ పరీక్షలు పండుగల్లాంటివి. పరీక్షలను విద్యార్థులను ఆనందంగా స్వీకరిస్తే.. ఎలాంటి ఒత్తిడి ఉండదు. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో పండుగ వాతావరణాన్ని ఏర్పరచాలి.

➢ ఎక్కువ నవ్వండి.. ఎక్కువ మార్కులు తెచ్చుకోండి (స్మైల్ మోర్.. స్కోర్ మోర్)

➢ మీరు ప్రశాంతంగా ఉంటే జ్ఞాపకశక్తి అధికంగా ఉంటుంది. జ్ఞాపకశక్తికి ప్రశాంతతే మంచి టానిక్

➢ ఇతరులతో కన్నా మీతో మీరు పోటీపడండి. ఇది మీకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.

➢ సచిన్ టెండూల్కర్‌ను చూడండి. గత 20 ఏళ్లుగా ఆయన ప్రతిసారి మెరుగవుతూ తన రికార్డులను తానే బద్దలుకొట్టాడు.

➢ ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్లే దొడ్డి దారులు, చీటింగ్ వంటి వాటికి పాల్పడతారు. కొందరు విద్యార్థులు తమ సమయమంతా చీటింగ్ చేయడానికి వెచ్చిస్తారు. దానికన్నా వారు చదువు మీద దృష్టి పెడితే బాగుంటుంది.

➢ చీటింగ్‌ను అలవాటుగా మార్చుకుంటే నేర్చుకోవాలన్న తపన తగ్గిపోతుంది.

➢ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ కలాం సైనిక బలగాల్లో చేరాలనుకున్నారు. కానీ చేరలేక పోయారు. అది తనకు ఆటంకం అనుకొని ఉంటే.. దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయేది.

**–జనసందేశ్ ప్రతినిధి**

### మోదీకి కృతజ్ఞతలు



'మన్ కీ బాత్'లో ప్రధాని తన విజయాలను ప్రస్తావించడంపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సంతోషం వ్యక్తం చేశాడు. విద్యార్థులకు తనను స్ఫూర్తిదాయకంగా చెప్పినందుకు సచిన్ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పాడు. క్రీడాకారుడికైనా, విద్యార్థికైనా సాధన చాలా ముఖ్యమని సచిన్ సూచించాడు.




జనవరి 24న 'నేషనల్ సేవ్ ఏ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా బిజెపి తెలంగాణ శాఖ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లంబాడబస్తీలో 'భేటీ బచావో – భేటీ పఢావో' కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, బిజెపి హైదరాబాద్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, 'భేటీ బచావో – భేటీ పఢావో' ఛైర్మన్ విజయలక్ష్మి, ఉమారాణి, గీతామూర్తి, విజయ, అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



# మతపరమైన రిజర్వేషన్లను అడ్డుకోవాలి

డా॥ బి.ఆర్.అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అగౌరపరుస్తూ ముస్లింలకు మత ప్రాతిపదికన 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్ దుయ్యబట్టారు. దీనిని జాతీయ వాదులు, బిజెపి కార్యకర్తలు, ప్రజలు అడుగడుగునా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

జనవరి 26న 68వ గణగంత్ర దినోత్సవం సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో డా॥ లక్ష్మన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఎంతో దూరదృష్టితో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారనీ... రాష్ట్ర ప్రభుత్వం దుర్బుద్ధితో ఓటుబ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతూ మతపరమైన రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నం చేస్తుందని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మాటలతో మభ్యపెడుతున్నదని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకపోవడం, దళితులకు 3 ఎకరాల భూ పంపిణీ చేపట్టకపోవడం, రెండు పడకల గదుల నిర్మాణం పూర్తి చేయకపోవడం, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం.. ఇలా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని దుమ్మెత్తిపోశారు.

నాటి ప్రధాని వాజ్‌పాయి అణు పరీక్షలతో దేశాన్ని శక్తిమంతం చేశారని, అమెరికా ఆంక్షలు విధించినా భయపడకుండా దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని తెలిపారు. నేటి ప్రధాని నరేంద్ర మోదీ దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, సైనికులలో మనో స్థైర్యాన్ని నింపుతూ దేశ ప్రజలే కాకుండా విదేశాలలో నివసిస్తున్న భారతీయులు కూడా గర్వపడేలా చేస్తున్నారని అన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాద కవ్వింపు చర్యలకు గట్టి జవాబుగా సర్జికల్ స్ట్రైక్స్ జరిపించారని డా॥ లక్ష్మన్ కొనియాడారు.

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు కావస్తున్నా దేశంలో సమానత్వం, సామాజిక భద్రత లేదని, బీద, ధనికుల మధ్య అంతరం నానాటికి పెరిగిపోతున్నదని డా॥ లక్ష్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసమానతలు పోగొట్టడానికి పెద్దనోట్లు రద్దు చేశారని, నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తు న్నారని తెలిపారు. ఈ విషయంలో మనమంతా ప్రధానికి అండగా ఉండాలని కోరారు. 80 శాతం దేశ సంపద 20 శాతం ప్రజల చేతిలో పోగుపడి ఉందని, 58 శాతం దేశ సంపద కేవలం 1 శాతం వద్ద మాత్రమే ఉందని... దీనిని నివారించి ఆర్థిక పరిస్థితి చక్కదిద్దడానికి పధ్రానమంత్రి నరేంద్రమోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని డా॥ కె.లక్ష్మన్ అన్నారు.

ఈ కార్యక్రమంలో జాతీయ నాయకుడు నల్లు ఇంద్రసేనా రెడ్డి, బిజెపి శాసనసభాపక్ష నేత జి.కిషన్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఎన్.రాంచందర్ రావు, శాసనసభ్యుడు రాజాసింగ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్ రావు, మాజీమంత్రులు, మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర పదాధికారులు, వివిధ జిల్లాల బిజెపి అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి




బిజెపి కూకట్‌పల్లి కార్యాలయంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మాధవరం కాంతారావు, మాజీ మునిసిపల్ ఛైర్మన్ సీ.హెచ్.హనుమంత్ రావు, జి.శ్రీకర్ రావు, రవికుమార్ గౌడ్, విజిత్, పవన్ కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కులం ఏదైనా మంచి పనులు చేసిన వారే ప్రసిద్ధులు, కీర్తిమంతులవుతారు. – ఠాగూర్

ముఖచిత్ర కథనం








# అంత్యోదయ స్ఫూర్తితో కేంద్ర బడ్జెట్

• భువన

దేశ గతిని మార్చే సాహసోపేత నిర్ణయం పెద్దనోట్ల రద్దు అనంతరం.. రైల్వే బడ్జెట్‌ను సాధారణ బడ్జెట్‌తో మిళతం చేసిన తరుణంలో.. ప్రణాళికా, ప్రణాళికేతర వ్యయాల లెక్కలకు చరమగీతం పలికిన నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఈ ఏడాది బడ్జెట్‌కు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి... అంతకుమించి అంచనాలు ఉన్నాయి... వాటన్నింటినీ నిలబెట్టుకుంటూ ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాన్యమిచ్చింది. వృద్ధికి ఊతమిస్తూ.. ఉపాధి రంగానికి నూతనోత్సాహం అందిస్తూ.. మౌలికానికి పెద్దపీట వేస్తూ.. నూతన ఒరవడి సృష్టించింది. అవినీతిపరులు, అక్రమార్కులు, ఆర్థిక నేరగాళ్లపై ఉక్కుపాదం మోపింది.

21 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, విద్య, వైద్యం, రవాణా, రక్షణ .. అన్ని రంగాలకు నిధుల కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. పేదలు, రైతులు, దళితులు, బడుగులు, విద్యార్థులు, యువత, గ్రామీణులు.. ఇలా ఎవరినీ విస్మరించని అరుణ్ జైట్లీ 'సబ్ కా సాథ్ - సబ్ కా వికాస్' అన్న బిజెపి నినాదానికి అనుగుణంగా జమా పద్దుల లెక్కలు రూపొందించారు. దీన్‌దయాళ్ జన్మశతాబ్ది వేడుకలు జరపుకొంటున్న సమయాన ఆ మహనీయుడు ప్రవచించిన అంత్యోదయ స్ఫూర్తిని నింపుకొంది.. బడ్జెట్ 2017-18.



# వ్యవసాయ రంగంపై వరాలజల్లు

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగంపై వరాల జల్లు కురిసింది. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడు ఆరు శాతం ఎక్కువ నిధులు దక్కాయి. మంచి పంట రావాలంటే రైతుకు సకాలంలో తగినంత రుణం అందాలి. అందుకే ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.10 లక్షల కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ అభివృద్ధి రేటు 4.1 శాతంగా ఉంటుందని అంచనా వేశారు. కాంట్రాక్టు వ్యవసాయంపై నమూనా చట్టాన్ని రూపొందించి రాష్ట్రాలకు పంపారు.

**వ్యవసాయ కేటాయింపులు..**

- వ్యవసాయ రంగానికి గత బడ్జెట్‌లో రూ. 50,437 కోట్లు కేటాయించగా ఈసారి రూ. 56,992 కోట్లకు పెంపు
- 2017-18లో రికార్డు స్థాయిలో రైతులకు రూ. 10 లక్షల కోట్ల రుణ పంపిణీ లక్ష్యం
- రైతులకు రాయితీ వడ్డీపై స్వల్పకాలిక రుణాలు ఇచ్చేందుకు రూ. 15 వేల కోట్ల కేటాయింపు
- రైతులకు 7 శాతం రాయితీ వడ్డీపై రూ. 3 లక్షల వరకు స్వల్పకాలిక పంట రుణాలు. సకాలంలో రుణం చెల్లించిన రైతుకు ప్రోత్సాహకంగా 3 శాతం వడ్డీ తిరిగి అతని ఖాతాలో జమ





- రైతులకు 60 రోజులపాటు వడ్డీ రద్దు
- ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి రూ. 13,240 కోట్లు
- ప్రతి చుక్క నీటితో అధిక దిగుబడి సాధించే లక్ష్యంతో సూక్ష్మనీటిపారుదల రంగానికి నాబార్డు ద్వారా రూ. 5వేల కోట్ల మూలనిధి
- పాడిపరిశ్రమ అభివృద్ధికి రూ. 2వేల కోట్ల మూలనిధితో డెయిరీ ప్రాసెసింగ్ నిధి, మూడేళ్లలో దీన్ని ఎనిమిది వేల కోట్ల రూపాయలకు పెంచే యోచన
- ధరల స్థిరీకరణ నిధిని రూ. 3,500 కోట్లకు పెంచేందుకు ప్రతిపాదన
- మార్కెట్ జోక్యం పథకం, మద్దతు ధరల పథకం కింద రూ. 200 కోట్లు కేటాయింపు
- ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్)ల సంఖ్యను 250 నుంచి 585 పెంపు.
- పంట ఉత్పత్తులను శుభ్రపరిచి, గ్రేడింగ్ చేసి ప్యాక్ చేసే సదుపాయాల కోసం ఒక్కో ఈ-నామ్‌కు రూ. 75 లక్షల వరకు నిధుల కేటాయింపు
- భూసార పరీక్షలను వేగవంతం చేసేందుకు 648 కృషి విజ్ఞాన కేంద్రాల్లో మినీ ప్రయోగశాలల ఏర్పాటు, శిక్షణ పొందినవారితో మరో 1000 మినీ ప్రయోగశాలల ఏర్పాటుకు రాయితీతో రుణాలు.

# జై జవాన్

రక్షణ రంగానికి కేటాయింపులు 6.2 శాతం మేర పెరిగాయి. గత బడ్జెట్‌తో పోలిస్తే రూ. 16వేల కోట్లు అధికంగా రూ. 2,62,390 కోట్లు కేటాయించారు. మాజీ సైనికుల పింఛన్లను ఇందులో జోడించలేదు.

- ఖర్చు చేసే ప్రతి రూపాయిలో రక్షణ రంగ వాటా 9 పైసలు.
- మొత్తం కేటాయింపుల్లో ఆధునికీకరణ, కొత్త ఆయుధాల కొనుగోలుకు ఉద్దేశించిన పెట్టుబడి వ్యయం కింద రూ. 86,488 కోట్లు
- ఆయుధ కొనుగోళ్లకు ఉద్దేశించిన సొమ్ములో సింహభాగం (రూ. 33,555.62 కోట్లు) వైమానిక దళానికి వెళ్లాయి. ఇందులో రూ. 19,277 కోట్లను విమానాల కొనుగోలుకు ప్రత్యేకించారు. సైన్యానికి రూ. 25,175.63 కోట్లు, నౌకాదళానికి రూ. 19,874 కోట్లు.
- రక్షణ పింఛన్లకు రూ. 85,737కోట్లు కేటాయింపు
- సైనిక సిబ్బందికి ప్రయాణ టికెట్ల బుకింగ్‌లో ఇబ్బందులను నివారించడానికి 'కేంద్రీకృత రక్షణ ప్రయాణ వ్యవస్థ' ఏర్పాటు, దీని ద్వారా వారికి ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకునే సౌలభ్యం.
- 'భారత్‌లో తయారీ' కార్యక్రమం కింద భారీ ఆయుధాల తయారీకి శ్రీకారం, రక్షణ రంగ పరిశోధన కేంద్రాల ఏర్పాటు, ఆయుధాల దిగుమతి తగ్గి విదేశీ మారకద్రవ్యం ఆదా.
  - మన రక్షణ అవసరాల్లో సొంతంగా ఉత్పత్తి చేసుకుంటున్నది: 40 శాతం
  - వచ్చే ఐదేళ్లలో పెంచాలనుకుంటున్నది:



70 శాతం


  - ఆయుధాల దిగుమతిని 20-25 శాతం తగ్గించినా దేశంలో కనీసం లక్షమందికి ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించవచ్చు.
  - ప్రైవేటు కంపెనీల భాగాస్వామ్యానికి అంకురార్పణ, రిలయెన్స్ ఏరోస్పేస్, పంజ్ లాయడ్ కంపెనీలతో రాకెట్ లాంఛర్లు, రక్షణ రంగానికి తగిన వాహనాల తయారీకి ఒప్పందం.



తమ పూర్వీకుల ఘనత మీద బ్రతికే వారిని మృతవీరుల జాబితాలో చేర్చవచ్చు. - లాసన్

# బడ్జెట్‌లో 10 అంశాలు

1. రైతులు: ఐదేళ్లలో వీరి ఆదాయం రెట్టింపు చేయడానికి కట్టుబడి ఉన్నాం
2. గ్రామీణ జనాభా: ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన
3. యువత: విద్య, నైపుణ్యాలు, ఉద్యోగాల ద్వారా బలోపేతం చేయడం
4. పేదలు, అణగారిన వర్గాలు: సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణ వ్యవస్థలను బలోపేతం చేయడం
5. మౌలిక సదుపాయాలు: జీవన నాణ్యత, ఉత్పాదకత, సమర్థత కోసం
6. ఆర్థిక రంగం: బలమైన సంస్థల ద్వారా వృద్ధి, సుస్థిరత
7. డిజిటల్ ఆర్థికత: సత్వర, పారదర్శక, జవాబుదారీతనం కోసం.
8. ప్రజా సేవ: ప్రజా భాగస్వామ్యం ద్వారా సమర్థ పాలన, సమర్థ సేవ.
9. సమర్థ ద్రవ్య యాజమాన్యం: వనరులను తగినంతగా కేటాయించి, ద్రవ్య స్థిరత్వాన్ని పరిరక్షించడం
10. పన్ను పరిపాలన: నిజాయతీపరుల్ని గౌరవించడం.




**మొత్తం బడ్జెట్ : రూ.21.46 లక్షల కోట్లు**

| | |
|---|---|
| మౌలిక వసతులు : | రూ. 3.96 లక్షల కోట్లు |
| రవాణా రంగం : | రూ. 2.42 లక్షల కోట్లు |
| రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు : | రూ. 4.11 లక్షల కోట్లు |
| ఆహార సబ్సిడీ : | రూ. 1.45 లక్షల కోట్లు |
| రక్షణ రంగం : | రూ. 2.62 లక్షల కోట్లు |
| వైద్యం : | రూ. 48,878 కోట్లు |
| విద్యుత్ రంగం : | రూ. 13,881 కోట్లు |
| క్రీడలు : | రూ. 1943 కోట్లు |

# డిజిటల్ ఎకానమీకి ప్రోత్సాహం

పెద్దనోట్ల రద్దు అనంతరం గతేడాది నవంబరు 8 నుంచి డిసెంబరు 31 వరకు 1.09 కోట్ల ఖాతాల్లో రూ.2 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు నగదు జమ అయ్యాయి. 1.48 లక్షల ఖాతాల్లో రూ.80 లక్షల కంటే ఎక్కువే జమ అయింది. ఆన్‌లైన్ లావాదేవీలంటే ఆమడదూరం పారిపోయేవారు కూడా పెద్ద నోట్ల రద్దు తరువాత డిజిటల్ లావాదేవీలకు సై అంటున్నారు. నెట్ బ్యాంకింగ్, వ్యాలట్ పేమెంట్, యూపీఐ అంటూ కొత్త'ధనాన్ని' స్వీకరించారు. ప్రభుత్వమూ నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడంలో భాగంగా బడ్జెట్లో కీలక నిర్ణయాలు ప్రకటించింది. వచ్చే ఏడాది నాటికి రెండున్నర వేల కోట్ల నగదు రహిత లావాదేవీలు జరిపేలా లక్ష్యం పెట్టుకుంది.

➢ పెద్ద నోట్ల రద్దుతో 35 శాతం పెరిగిన వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపులు.

➢ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు త్వరలోనే ఆధార్ అనుసంధానిత చెల్లింపుల వ్యవస్థ. డెబిట్‌కార్డులు, మొబైల్ వ్యాలెట్లు, ఫోన్లు లేనివారికి ఇదెంతగానో ఉపయోగం.

➢ భీమ్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రెండు కొత్త పథకాలు. ఇవి వ్యక్తులకు రిఫరల్ బోనస్‌గాను, వ్యాపారులకు నగదు రహితంగాను ఉంటాయి.

➢ 2017-18లో యూపీఐ, యూఎస్ఎస్‌డీ, ఆధార్ పే, ఐఎంపీఎస్, డెబిట్ కార్డుల ద్వారా రూ.2500 కోట్ల నగదు రహిత చెల్లింపులు జరపాలన్నది లక్ష్యం.

➢ ఈ ఏడాది సెప్టెంబరు నాటికి 20 లక్షల ఆధార్ ఆధారిత పీవోఎస్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చేలా బ్యాంకులకు ప్రోత్సాహం.

➢ పెట్రోలు బంకులు, ఆసుపత్రులు, ఎరువుల దుకాణాలు, మున్సిపాలిటీలు, రవాణా శాఖ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఇతర సంస్థల్లో భీమ్ యాప్ సహా నగదు రహిత చెల్లింపులకు ప్రోత్సాహం.

➢ గ్రామీణ ప్రాంతాలు, చిన్నచిన్న పట్టణాల్లో తపాలా కార్యాలయాలు, చౌకధరల దుకాణాలు, బ్యాంకుల ప్రతినిధుల ద్వారా నగదు రహిత చెల్లింపుల ప్రోత్సాహం.

➢ డిజిటల్ లావాదేవీలపై ముఖ్యమంత్రుల కమిటీ చేసిన మధ్యంతర సిఫార్సులను వీలైనంత త్వరగా అమలు చేసేందుకు ప్రణాళిక.

➢ సంస్థాగత సంస్కరణల్లో భాగంగా రిజర్వు బ్యాంకులో ప్రస్తుతం ఉన్న 'చెల్లింపులు, పరిష్కారాల పర్యవేక్షణ, నియంత్రణ మండలి' స్థానంలో 'చెల్లింపుల నియంత్రణా మండలి' ఏర్పాటు.

➢ పీవోఎస్, ఐరిస్ రీడర్, స్కానర్లు, ఆధార్ యంత్రాలకు అన్ని రకాల సుంకాలు తొలగింపు.

➢ డిజిటల్ చెల్లింపులు, సమస్యల పరిష్కార వ్యవస్థ బలోపేతం.

➢ డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాలను అడ్డుకొనేందుకు 'కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం' ఏర్పాటు.

➢ నల్లధనం నిరోధంలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రూ.3 లక్షలకు మించి నగదు లావాదేవీలకు అనుమతి నిరాకరణ.


➢ వ్యక్తి లేదా సంస్థ ఈ పరిమితికి మించి లావాదేవీలు నిర్వహిస్తే.. ఆ మొత్తానికి 100 శాతం జరిమానా.

ఆధునిక వైద్యం శరీరాన్ని స్వస్థత పరచాలని చూస్తున్నది మనస్సూ, శరీరం ఒక్కటే... మనస్సును వదిలేసి చేసే వైద్యం తీవ్ర పొరపాటు. - ప్లేటో

# ప్రజారోగ్యానికి బడ్జెట్ వైద్యం

కునారిల్లుతున్న ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థకు జవసత్వాలు కల్పించటంపై ప్రభుత్వం దూరదృష్టిని ప్రదర్శించింది. సరైన చికిత్సకు నోచుకోని పేదలపై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూ.. తాజా బడ్జెట్‌లో వైద్యరంగానికి దాదాపు 23 శాతం మేరకు కేటాయింపులు పెంచింది. మొత్తం రూ.48,878 కోట్లు కేటాయించింది. దీర్ఘకాలిక జబ్బుల బాధితుల్లో చాలామంది పేదలే ఉంటున్న నేపథ్యంలో కాలా అజార్, బోదకాలు, కుష్టు, తట్టు, క్షయ వంటి వ్యాధులను నిర్ణీత కాలావధిలోగా నిర్మూలించాలని కంకణం కట్టుకుంది. మాతా, శిశు మరణాలను తగ్గించటంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించింది.

❍ 1.5లక్షల ఆరోగ్య ఉప కేంద్రాలను ఆరోగ్య, సంక్షేమ కేంద్రాలుగా మలచటం.




❍ స్పెషలిస్టు డాక్టర్ల కొరతను అధిగమించటానికి ఏటా 5వేల పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్ల సృష్టి. పెద్ద జిల్లా ఆసుపత్రుల్లో డీఎన్‌బీ కోర్సుల ఆరంభానికి చర్యలు. ఎంపికచేసిన ఈఎస్ఐ, నగర పాలిక ఆసుపత్రుల్లో పీజీ విద్య బలోపేతం.

❍ చవకగా మందులు అందుబాటులో ఉండేందుకు, జనరిక్ మందుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఔషధాలు, సౌందర్య సాధనాల నిబంధనల్లో సవరణ.

❍ వైద్య పరికరాల ధరలు తగ్గేందుకు, ఈ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కొత్త నిబంధనలు.

❍ వృద్ధుల కోసం ఆధార్ ఆధారిత స్మార్ట్‌కార్డుల ప్రవేశం.

❍ జాతీయ ఆరోగ్య కార్యక్రమానికి రూ.27,131 కోట్లు కేటాయింపు, గత బడ్జెట్ కన్నా రూ.6,369 కోట్లు అదనం.

❍ 'ఆయుష్'కు రూ.1,428.65 కోట్ల కేటాయింపు. గత బడ్జెట్ కన్నా రూ.102.45 కోట్లు ఎక్కువ.

❍ ప్రజారోగ్యాన్ని కాపాడే ఉద్దేశంతో సిగరెట్లు, బీడీలు, పాన్ మసాలా, నమిలే పొగాకు, పొగాకు జర్దా, గుట్కాలపై ఎక్సైజ్ సుంకం పెంపు.

# స్వచ్ఛ రాజకీయాల దిశగా

ఎన్నికల్లో నల్లధన ప్రవాహాన్ని అడ్డుకొనేందుకు.. రాజకీయ పార్టీల నిధుల సమీకరణ విధానాన్ని పారదర్శకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నూతన విధానాలను ప్రకటించింది. నగదు రూపంలో స్వీకరించే విరాళాలపై పరిమితులు విధించడంతోపాటు ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది.

➢ ఎన్నికల కమిషన్ సూచన మేరకు ఒక్కో వ్యక్తి నుంచి నగదు రూపంలో పార్టీలు తీసుకునే విరాళాలకు గరిష్ఠ పరిమితిని రూ.20వేల నుంచి రూ.2వేలకు తగ్గించింది.

➢ చెక్కులు, డిజిటల్ పద్ధతుల్లో దాతల నుంచి పార్టీలు విరాళాలు పొందొచ్చు. వీటిపై ఏ నియంత్రణా లేదు.



➢ ఆర్బీఐ చట్టానికి సవరణ చేసి.. ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసేందుకు ప్రభుత్వం వీలు కల్పిస్తుంది. బ్యాంకుల్లో బాండ్లు కొనుగోలు చేసి దాతలు వాటిని పార్టీలకు విరాళాలుగా ఇవ్వొచ్చు. పార్టీలు తిరిగి బ్యాంకుల్లో వాటిని మార్చుకుని నిధులు పొందుతాయి. కొనుగోలుదారుల వివరాలు ఉంటాయి కాబట్టి ఈ విధానం పారదర్శకంగా ఉంటుంది.

➢ ఆదాయపు పన్ను చట్టం ప్రకారం నిర్ణీత గడువులోగా ప్రతిపార్టీ రిటర్న్‌లు దాఖలు చేయాలి. బాండ్లవివరాలూ వెల్లడించాలి.

➢ అన్నినిబంధనలూ అనుసరిస్తేనే పార్టీలకు పన్ను మినహాయింపు వర్తిస్తుంది. రిటర్న్ దాఖలు చేసే దాతలకు ఆయా విరాళాలపై మినహాయింపు ఉంటుంది.

# అభివృద్ధి 'దారులు'

బడ్జెట్ 2017-18లో జాతీయరహదారుల నిర్మాణానికి పెద్ద పీట దక్కింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12 శాతం అధికంగా రూ.64,900 కోట్లను కేటాయించింది. 2016-17లో ఈ కేటాయింపులు రూ.57,976 కోట్లు మాత్రమే.

☞ రెండు వేల కి.మీ. తీరప్రాంత అనుసంధాన రహదారుల నిర్మాణం, అభివృద్ధి, వీటి ద్వారా నౌకాశ్రయాలతో మారుమూల గ్రామాలకు అనుసంధానత.

☞ 2011-14 మధ్య రోజుకు 73 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించగా పీఎంజీఎస్‌వై కింద 2016-17లో రోజుకు 133 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం.

☞ వామపక్ష తీవ్రవాదం గల మండలాల్లో 100 మందికి పైగా నివసిస్తున్న నివాస ప్రాంతాలకు పీఎంజీఎస్‌వై కింద 2019 నాటికి రహదారుల అనుసంధానత కల్పించాలని నిర్ణయం.

☞ పీఎంజీఎస్‌వై కింద 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.19 వేల కోట్లు కేటాయింపు, రాష్ట్రాల వాటాతో కలిపి మొత్తం రూ.27 వేల కోట్ల వ్యయం.




ప్రతిభా పాటవాలు సూర్య కిరణాలవలె విస్తరిస్తాయి. అవి కేంద్రీకృతమైతే ప్రకాశిస్తాయి. - స్వామి వివేకానంద

# రైల్వేల అభివృద్ధిపై దృష్టి

రైల్వేలకు ప్రత్యేక బడ్జెట్ రూపొందిస్తూ బ్రిటిష్ కాలం నుంచి వస్తున్న సంప్రదాయానికి తెరదించిన మోదీ ప్రభుత్వం తొలిసారి సాధారణ బడ్జెట్‌లో భాగంగా తీసుకొచ్చింది. భద్రత, ప్రయాణికుల సౌకర్యాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశుభ్రత, నవీకరణలపై ప్రధానంగా దృష్టి సారించింది.

- 2017–18 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల్లో మూలధన, అభివృద్ధి వ్యయం రూ. 1,31,000 కోట్లు.
- కేంద్ర బడ్జెట్ నుంచి రూ. 55 వేల కోట్లు, గత బడ్జెట్లో కన్నా రూ. 10 వేల కోట్లు అదనం
- ఆన్‌లైన్‌లో ఐఆర్‌సీటీసీ ద్వారా రైలు టికెట్లను కొనుగోలు చేసే వారికి సర్వీస్ ఛార్జి రద్దు.
- చివరి క్షణం వరకు భర్తీకాని సీట్లను రైలు బయలుదేరడానికి నాలుగు గంటల(ఛార్టు తయారీ సమయం) ముందు కనిష్ఠ ధరకు (కాంపిటీటివ్ టికెట్ బుకింగ్) విక్రయం.
- ఎస్ఎంఎస్ ఆధార 'క్లీన్ మై కోచ్(మా రైలు పెట్టెను శుభ్రంచేయండి) సర్వీస్' ప్రారంభం.
- రైలు పెట్టెల్లో అవసరాలు, బోగీలకు సంబంధించిన ఫిర్యాదుల నమోదు కోసం 'రైల్ మిత్ర'
- దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా రైల్వే స్టేషన్లలో లిఫ్టులు, ఎస్కలేటర్లు.. ఈ విధంగా కనీసం 500 స్టేషన్ల అభివృద్ధి
- 2017-18 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 3500 కిలోమీటర్ల మేర నూతన రైల్వే లైన్లు.
- 2017-18 ఆర్థిక సంవత్సరంలో కనీసం 25 రైల్వే స్టేషన్ల పునర్ అభివృద్ధికి చర్యలు.
- దాదాపు 7 వేల రైల్వే స్టేషన్లకు సౌర విద్యుత్‌ను అందించడానికి చర్యలు. 'సోలార్ మిషన్'లో భాగంగా మరో 2 వేల స్టేషన్లలో అమలు.
- 2019 నాటికి రైల్వేల్లోని అన్ని బోగీల్లో జీవ మరుగుదొడ్లను ఏర్పాటు.
- ఘన వ్యర్థాలను వర్యావరణ అనుకూలమైన రీతిలో నిర్మూలించడం, జీవ వ్యర్థాలను ఇంధనంగా మార్చడం కోసం ఢిల్లీ, జైపూర్ రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మక ప్లాంట్ల ఏర్పాటు. ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఇలాంటివి మరో ఐదు ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదన.
- ప్రైవేటు భాగస్వామ్యంతో కొన్ని రకాల వస్తువుల్ని ఆరంభం నుంచి చివరి పాయింట్ దాకా చేరవేయడం కోసం సమీకృత రవాణా విధానం. వ్యవసాయ ఉత్పత్తుల్లాంటి త్వరగా పాడైపోయే వస్తువుల్ని చేరవేయడం కోసం అవసరమైతే రైలు పెట్టెల నిర్మాణంలో మార్పులు.
- పర్యాటక, యాత్రా స్థలాల సందర్శన కోసం ప్రత్యేక రైళ్లు
- త్వరలో కొత్త మెట్రో రైలు విధానం, ప్రస్తుతమున్న చట్టాలను హేతుబద్ధీకరిస్తూ.. కొత్త మెట్రో రైలు చట్టం.
- దేశవ్యాప్తంగా ఉన్న 14 మెట్రో రైలు ప్రాజెక్టులకు రూ. 17,810 కోట్లు కేటాయింపు.
- స్టాక్ ఎంక్స్ఛేంజీల్లో రైల్వే ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఆర్‌సీటీసీ, ఐఆర్ఎఫ్‌సీ, ఐఆర్‌సీఓఎన్.
- ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా.. రూ. లక్ష కోట్ల కార్పస్ నిధితో 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోస్'(జాతీయ రైలు భద్రత నిధి) ఏర్పాటు. బ్రాడ్‌గేజ్ లైన్లపై కాపలాలేని లెవెల్ క్రాసింగ్‌లను 2020 కల్లా పూర్తిగా తొలగిస్తారు.



# తెలంగాణకు పెద్దపీట

దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని రెండు తెలుగు రాష్ట్రాలకు రూ. 5,135 కోట్లు కేటాయించింది. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి రూ. 1,729 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 3,406 కోట్లు దక్కాయి. రెండు రాష్ట్రాలకు మూడేళ్ల సగటు కేటాయింపు రూ. 2,797 కోట్లు మాత్రమే. ఇందులో తెలంగాణ రాష్ట్ర సగటు రూ. 601 కోట్లు, ఆంధ్రప్రదేశ్ సగటు రూ. 2,196 కోట్లుగా ఉంది. ఆధునికీకరణకు రెండు రాష్ట్రాల్లో సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లను ఎంపిక చేశారు.





- ఈ జోన్ పరిధిలో ఇప్పటికే 170 ప్రాంతాల్లో మానవరహిత లెవెల్ క్రాసింగ్‌ల ను తొలగించారు, మిగిలిన 185 ప్రాంతాలు 2020 నాటికి సిద్ధం.
- బలార్షా–ఖాజీపేట, విజయవాడ–గూడూరు సెక్షన్లల్లో మూడో లైను మార్గాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణ.
- మరిన్ని స్టేషన్లలో సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు.
- జోన్ పరిధిలో 4,138 బోగీల్లో బయోటాయిలెట్ల ఏర్పాటు. 2019 నాటికి మిగిలిన 1,115 బోగీల్లో ఏర్పాటు.
- సికింద్రాబాద్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంటు ఏర్పాటుకు ఆమోదం.

# విద్యుత్‌కు రూ.13,881 కోట్లు



❍ విద్యుత్ రంగానికి బడ్జెట్‌లో రూ.13,881 కోట్లు కేటాయించారు.

❍ కేంద్ర విద్యుత్ పథకాలైన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామజ్యోతి యోజన (డీడీయూజీజేవై), పట్టణ విద్యుత్ పటిష్టతకు సంబంధించిన సమగ్ర విద్యుత్ అభివృద్ధి పథకానికి (ఐపీడీఎస్) బడ్జెట్‌లో రూ.10,635 కోట్లు కేటాయించారు.

❍ దేశంలో గ్యాస్ కొరత కారణంగా నిలిచిపోయిన విద్యుత్ ప్రాజెక్టులను వినియోగంలోకి తెచ్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'విద్యుత్ వ్యవస్థ అభివృద్ధి నిధి'కి రూ.750 కోట్లు కేటాయింపు.

❍ పునరుత్పాదక ఇంధనవనరులకు రూ.5,473 కోట్లు కేటాయింపు. సౌర విద్యుత్‌కు రూ.4,034 కోట్లు.

❍ ప్రస్తుతం 21 రాష్ట్రాల్లో 34 సౌర పార్కులు అభివృద్ధి దశలో ఉన్నాయి. వీటి సామర్థ్యం 20 వేల మెగావాట్లు. ఈ సామర్థ్యాన్ని 40 వేల మెగావాట్లకు పెంచాలని లక్ష్యం.

# క్లీన్ ఎనర్జీకి ప్రోత్సాహం

➢ దేశంలో శుద్ధ ఇంధనాన్ని ప్రోత్సహించేందుకు ప్రోత్సహకాలు, సౌర, పవన విద్యుత్ కర్మాగారాల్లోని వివిధ పదార్థాలపై ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలు భారీగా తగ్గింపు.

➢ మెగావాట్ల అదనపు సామర్థ్యం కోసం రెండో దశ సౌర పార్కు అభివృద్ధి.

➢ దాదాపు 7వేల రైల్వే స్టేషన్లకు సౌర విద్యుత్.

➢ సౌర సెల్స్/ఫలకాలు/మాడ్యూల్స్ తయారీలో ఉపయోగించే సోలార్ టెంపర్డ్ గ్లాస్‌పై కనీస కస్టమ్స్ సుంకాన్ని (బీసీడీ) పూర్తిగా తొలగింపు.

➢ సోలార్ టెంపర్డ్ గ్లాస్ తయారీలో ఉపయోగించే భాగాలు, ముడిపదార్థాలపై కౌంటర్‌వెయిలింగ్ సుంకాన్ని(సీవీడీ), ఎక్సైజ్ సుంకం 12.5 శాతం నుంచి 6 శాతానికి తగ్గింపు.

➢ పవన శక్తితో నడిచే జనరేటర్లలోని ఉపకరణాల తయారీకి ఉపయోగించే రెసిన్, ఉత్ప్రేరకంపై బీసీడీ, సీవీడీ, ప్రత్యేక అదనపు సుంకం (ఎస్ఏడీ)ని 24 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు. 12.5 శాతంగా ఉన్న ఎక్సైజ్ సుంకం రద్దు.

➢ ఫ్యూయెల్ సెల్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థలకు అవసరమయ్యే యంత్రాలపై బీసీడీ, సీవీడీ, ఎస్ఏడీలను 30 శాతం నుంచి 11 శాతానికి తగ్గింపు. ఎక్సైజ్ సుంకం 12.5 శాతం నుంచి 6 శాతానికి కుదింపు.



➢ బయోగ్యాస్/ బయో-మిథేన్/ హైడ్రోజన్ అనుబంధ ఉత్పత్తి ఆధారంగా నడిచే వ్యవస్థల నియంత్రణకు అవసరమయ్యే అన్ని రకాల యంత్రాలపై బీసీడీ, సీవీడీ, ఎస్ఏడీలను 11 శాతానికి తగ్గింపు. ఎక్సైజ్ సుంకం 12.5 శాతం నుంచి 6 శాతానికి కుదింపు.

➢ పట్టణాభివృద్ధి శాఖకు రూ.34,212 కోట్లు. స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టుకూ రూ.3,989.50 కోట్లు.

➢ మౌలిక రంగానికి అత్యధికంగా రూ.3,96,135 కోట్లు.

➢ జాతీయ రహదారుల నిర్మాణం, జలమార్గాలు, నౌకా రవాణా, సాగరమాల ప్రాజెక్టు, పౌరవిమానయాన రంగాలకు చెందిన పనులు వేగిరం.

➢ రైలు, రహదారులు, నౌకా రవాణా రంగాలను రవాణా రంగంగా పేర్కొంటూ ఈ మూడు రంగాలకు ప్రత్యేకంగా రూ.2,41,387 కోట్లు.

➢ ఆర్థిక నేరస్థులపై ఉక్కుపాదం మోపేందుకు చట్టపరంగా అవసరమైన మార్పులు తీసుకువచ్చే యోచన.

➢ నిర్ణీత గడువులోగా ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయనివారిపై అపరాధ రుసుం.

➢ కేంద్ర బడ్జెట్లో ఈ సారి క్రీడలకు రూ.1943 కోట్లు కేటాయింపు. గత బడ్జెట్ కన్నా రూ.350 కోట్లు అధికం.

## నీటిపారుదలకు భారీగా నిధులు

జాతీయహోదా ప్రాజెక్టులు, గతంలో ఏఐబీపీ కింద, ప్రస్తుతం ప్రధానమంత్రి కృషి సించయ్ యోజన కింద గుర్తించిన ప్రాజెక్టులకు నాబార్డు ద్వారానే నిధులు. నాబార్డులో పెట్టుబడికి రూ.9,020 కోట్లు కేటాయింపు.

పి.ఎం.ఎస్.కె.వై కింద దేశవ్యాప్తంగా మొదటిదశలో 26, రెండోదశలో 34, మూడోదశలో 46 ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యం.

➢ కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా పూర్తి చేయాలని నిర్ణయించిన ప్రాజెక్టుల్లో తెలంగాణ నుంచి 11 ప్రాజెక్టులు.

➢ మొదటిదశలో దేవాదుల, రెండోదశలో మరో 9 ప్రాజెక్టులు, మూడోదశలో శ్రీరాంసాగర్ వరదకాలువ.

➢ హర్ కేత్ కో పానీ పథకానికి రూ. 1,450 కోట్లు




# వేతన జీవులకు ఊరట

**పన్ను భారం తగ్గితే పొదుపు పెరుగుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అంటున్నారు. తాను ప్రవేశపెట్టిన నాలుగో బడ్జెట్‌లో పన్నులకు సంబంధించిన ప్రతిపాదనలపై ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక విషయాలు వివరించారు. ఆ ఇంటర్వ్యూను చూద్దాం:**

**ప్ర: కనీస పన్ను శ్లాబులో మాత్రమే పన్ను ప్రోత్సాహకాలు ప్రకటించడానికి కారణం ఏమిటి?**

**జ:** చట్టానికి లోబడి పన్ను కట్టాల్సిన వాళ్లు చాలామంది కట్టకుండా పన్నులు ఎగవేస్తుంటే చట్టబద్ధంగా పన్నుచెల్లించే వాళ్ళపైనే భారమంతా పడుతోంది. చట్టానికి విధేయులై బుద్ధిగా పన్నులు చెల్లిస్తున్న వారిలో అత్యంత బలహీనులైన వారికి ఊరట అవసరం. నేను ఈ తరగతిలో రెండు వర్గాలను గుర్తించాను. ఒకటి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు. రూ. 50 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన ఈ తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు కల్పించాం. రెండవది, చిన్న పన్ను చెల్లింపుదారులు. ద్రవ్యోల్బణం జీవన వ్యయాన్ని మరింత పెంచింది. వీరిలో చాలామంది దిగువ మధ్యతరగతికి చెందిన శ్రామిక వర్గం లేదా సేవా రంగంలో ఉన్నారు. వారు ఇప్పుడు చెల్లిస్తున్నట్టు 10 శాతం కాక 5 శాతమే పన్ను చెల్లించడం సబబని నేను భావించాను. దీనివల్ల చిన్న చిన్న మొత్తాలు పొదుపు చేయడం ద్వారా రూ. 5 లక్షల ఆదాయం ఉన్నవారు స్వల్ప మొత్తం పన్ను చెల్లిస్తే సరిపోతుంది, లేదా అసలు చెల్లించనవసరం కూడా లేదు. ఎక్కువ పన్ను శ్రేణిలోని వారికి రూ. 12, 500 వరకు పన్ను తగ్గుతుంది. అసలు ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయని వారు రిటర్నులు దాఖలు చేసేలా ప్రోత్సహించేందుకు నేను ప్రయత్నిస్తున్నాను. ఆదాయం పన్ను చెల్లింపుదారుల్లో అన్ని శ్రేణుల వారికి బడ్జెట్‌లో ఎంతోకొంత ఊరట లభించి ఖర్చు చేయడానికి కొంత డబ్బు మిగులుతుంది.

**ప్ర: బడ్జెట్ వస్తు వినియోగాన్ని పెంచుతుందని భావిస్తున్నారా?**

**జ:** అదే నా లక్ష్యం. పన్ను రేట్ల తగ్గింపు ఆ దిశలో తీసుకున్న ఒక కీలకమైన చర్య.

**ప్ర: పన్ను చెల్లింపుదారుల్లో అత్యధికులు వేతనజీవులే అని గుర్తించి కూడా రూ.50 లక్షలు–కోటి ఆదాయ శ్రేణి వారిపై సర్‌ఛార్జి ఎందుకు వేశారు?**

**జ:** ఈ ఆదాయ శ్రేణి వారు వేతన జీవులు కాదు. పెద్దమొత్తంలో ఆదాయం పొందుతున్న వృత్తి నిపుణులు. రూ.కోటి ఆదాయం దాటినా వాళ్లు కూడా సర్‌ఛార్జి చెల్లిస్తారు. ఈ తరగతి వాళ్లకి తక్కువ సర్‌ఛార్జి విధించాలని కొందరు కోరుతున్నారు. ఇది ఆదాయం పెంచే చర్య. తక్కువ ధనికులైన వారికంటే అధిక సంపన్నులు ఎక్కువ స్థాయిలో పన్ను చెల్లించడం అనేది నైతికంగా కూడా సమర్థనీయమైన, సహేతుకమైన విషయమే.

**ప్ర: పెద్దనోట్ల రద్దు కాలంలో వచ్చిన డిపాజిట్లపై మీ అంచనా ఏమిటి?**

**జ:** చాలా పెద్దమొత్తంలో డిపాజిట్లు వచ్చాయి. రద్దుచేసిన నోట్ల రూపంలోని నగదులో భారీ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరుకుంది. ఇకముందు లావాదేవీలు చాలా వరకు నగదు రూపంలో జరగవని ఆశిస్తున్నాం. కనుక ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. వ్యక్తిగత ఆదాయం పన్ను ఖాతాలో ఈ సారి ఆదాయం పెరగడానికి ఇదీ ఒక కారణం. ఎక్కువ మొత్తాల్లో డబ్బు జమచేసిన 18 లక్షల మందిని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) గుర్తించింది. వీరంతా.. చట్టబద్ధంగా కట్టాల్సిన పన్ను కట్టాల్సిందే. డిపాజిట్ల పరిశీలన అనేది కేవలం మొదటిదశ మాత్రమే.

**ప్ర: మీరు కేటాయించే నిధులను ఖర్చుచేసే సామర్థ్యం ప్రభుత్వ విభాగాలకు ఉందనుకుంటున్నారా?**

**జ:** మా ప్రభుత్వంలో సామర్థ్యం, ఖర్చు కలిసే ఉంటాయి. ప్రధానమంత్రి నిర్దేశించుకున్న లక్ష్యాలు నెరవేరేదాకా నిద్రపోని మనిషి. రెండేళ్లలో మేము బడ్జెట్‌లో కేటాయింపుల కంటే ఎక్కువే ఖర్చుచేశాం.

**ప్ర: విదేశీ పెట్టుబడుల బోర్డును రద్దు చేయాలనుకుంటున్నారా?**

**జ:** అవును. ఈ ఏడాదిలోనే అది జరుగుతుంది. ప్రస్తుతం నిజానికి 90 శాతం అనుమతులు ఆటోమేటిక్ విధానంలో జరుగుతున్నాయి. ఏదో ఒక వ్యవస్థను అందుబాటులోకి తెస్తాం. చాలా సందర్భాల్లో సంబంధిత మంత్రిత్వ శాఖలే ఆయా రంగాల్లో విదేశీ పెట్టుబడులకు అనుమతినిస్తాయి. అయితే ఇప్పుడు రెండు మంత్రిత్వ శాఖల పరిశీలన జరగాలి, అవి రెండూ ఒకే విధమైన ప్రమాణాలను అనుసరిస్తాయి.

**ప్ర: రైలు చార్జీల పెంపును ఎన్నికల దృష్ట్యా వాయిదా వేశారా?**

**జ:** మేము ఒక వ్యవస్థను అమల్లోకి తెచ్చాం. రైల్వేలు బడ్జెట్‌లో నిర్దేశించిన విదానంలోనే ముందుకు సాగాలి. ■

## తెలుగు పద్మాలకు సన్మానం



ఇటీవల పద్మశ్రీ అవార్డులకు ఎంపికైన ఎక్కా యాదగిరిరావు, వాజిద్ అహ్మద్, బీవీఆర్ మోహాన్‌రెడ్డి, హనుమాన్ చౌదరి, చింతకింది మల్లేశం, వనజీవి రామయ్యలను జనవరి 29న హైదరాబాద్‌లోని దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ఘనంగా సన్మానించారు. విభిన్న రంగాల్లోని తెలుగువారిని పద్మ అవార్డులకు ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన తెలుగు వారిని సన్మానించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సైనికుల సంక్షేమమే ప్రాధాన్యం

ఎన్డీఏ ప్రభుత్వం మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఒకే ర్యాంకు ఒకే పింఛన్ కింద ఇప్పటికే రూ.6,285 కోట్లు విడుదల చేసిందని రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాశ్ భమ్రే తెలియజేశారు. "సైనిక కుటుంబంలో మాజీ సైనికులు ప్రధానమైన భాగం. వారు మన విలువలను, సంస్కృతిని కాపాడే వారు. గతానికి, వర్తమానానికి వారధులు," అని భమ్రే దిల్లీలోని మాజీ సైనికుల ఉత్సవాన్ని ప్రారంభిస్తూ అన్నారు. "మీ ప్రశ్నలన్నింటి గురించి ప్రధానమంత్రి, రక్షణ మంత్రి ఆలోచిస్తున్నారు. మీ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నారు. కాని దురదృష్టవశాత్తు కొంత మంది తప్పుడు ప్రకటనలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అవన్నీ నిజం కాదు," అని ఆయన అన్నారు. "గత 40 సంవత్సరాలుగా పరిష్కారం కాని మాజీ సైనికుల సమస్యలను మా ప్రభుత్వం పరిష్కరించింది. ఒకే ర్యాంకు ఒకే పింఛన్ పథకాన్ని అమలు చేసింది. దీని కోసం నవంబర్ 2015లో ఉత్తర్వులు జారీ చేసింది. 20,72,457 మంది మాజీ సైనికులు ఈ పింఛన్‌కు అర్హులు. ఈ పథకం కింద రూ. 10, 925 కోట్ల బకాయిలు చెల్లించవలసి ఉంది. ప్రతి ఏటా రూ. 7,489 కోట్ల చెల్లించాల్సి వస్తుంది," అని రక్షణ శాఖ సహాయ మంత్రి చెప్పారు.

## 2017లో భారత్‌లో 7.7 శాతం అభివృద్ధి: ఐరాస నివేదిక

2017 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.7 శాతం అభివృద్ధి సాధించే అవకాశం ఉందని, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉంటుందని ఐక్యరాజ్య సమితి నివేదికలో పేర్కొన్నారు. ప్రైవేటు వినియోగం ఎక్కువగా ఉండడం, క్రమేనా సంస్కరణలు అమలు చేయడం వల్ల ఈ అభివృద్ధి సాధ్యమని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అవకాశాలపై నివేదికను జనవరి 17న విడుదల చేశారు. భారత్ 2017 ఆర్థిక సంవత్సరంలో 7.7 శాతం అభివృద్ధి, 2018లో 7.6 శాతం అభివృద్ధి సాధిస్తుందని అంచనా వేశారు. పెద్ద దేశాల్లోకెల్లా భారత్ చాలా గతి శీలమైన దేశంగా ఉందని, అభివృద్ధి క్రమం కొనసాగుతుందని 2016 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.6 శాతం సాధించిందని పేర్కొన్నారు. వస్తు సేవల పన్ను వంటి సంస్కరణలు ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని ఈ నివేదికలో పేర్కొన్నారు. సంస్కరణలు సమర్థవంతమైన పన్నుల వ్యవస్థకు దోహదం చేయాలని ఈ నివేదికలో సూచించారు.




బిజెపి నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పల్లె గంగారెడ్డితో పాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



పేదలకు మేలు చేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టినందుకు ఫిబ్రవరి 4న ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బోధన్ బీజేవైఎం నాయకులు పాలాభిషేకం చేశారు. బీజేవైఎం నాయకులు శివ కుమార్, అరవింద్, కరణ్, అరుణ్, కైలాష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



పరుల సేవలో శరీరాలు శిథిలమైన వారు ధన్యులు. – వివేకానంద



జనవరి 30న నల్గొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మన్, జిల్లా అధ్యక్షుడు నూకల నర్సింహా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మనోహర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోలి మధుసూదన్ రెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



జనవరి 28న బిజెపి నిజామాబాద్ జిల్లా రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు పల్లె గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.



జనవరి 24న మేడ్చల్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాధవరి కాంతారావు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ ఎస్.మల్లారెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



జనవరి 29న మహబూబ్‌నగర్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.




ఫిబ్రవరి 4న రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.




జనవరి 28న రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహా రెడ్డి, జాతీయ నాయకుడు పేరాల శేఖర్ రావు, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.



జనవరి 30న యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభా పక్షనేత జి.కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.వి.శ్యాంసుందర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర యాదవ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



జనవరి 30న మహబూబాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాప సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవితకు బాటలు



"బడ్జెట్ దేశ భవితకు బాటలు వేసేలా ఉంది. అన్ని వర్గాల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉంది. ఒకరకంగా ఈ బడ్జెట్ మన భవిష్యత్తు (ఫ్యూచర్). ఫ్యూచర్ అన్న పదానికి నా మనసులో ఒక అర్థం ఉంది. ఎఫ్ అంటే ఫార్మర్ (రైతు). యూ అంటే అండర్ ప్రివిలేజ్డ్... దళిత, గిరిజన, బలహీన, పీడిత, మహిళా వర్గాలు. టీ అంటే ట్రాన్స్‌పరెన్సీ(పారదర్శకత), టెక్నాలజీ అప్‌గ్రడేషన్(సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకోవడం). యు అంటే అర్బన్ రిజివినేషన్(పట్టణ పునరుజ్జీవం). ఆర్ అంటే రూరల్ డెవలప్‌మెంట్ (గ్రామీణాభివృద్ధి). ఇ అంటే ఎంప్లాయిమెంట్ (ఉపాధి). దేశ ప్రజల కలలను సాకారం చేయడానికి ఈ బడ్జెట్ అండగా నిలుస్తుంది.

ఈ బడ్జెట్.. విద్య నుంచి వైద్యం వరకు, జౌళి తయారీ నుంచి పన్ను మినహాయింపుల వరకు ప్రతి ఒక్కరి కలలను సాకారం చేయడానికి గట్టి చర్యలు తీసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కోసం సమగ్ర ప్యాకేజీ ప్రకటించారు. దానివల్ల పన్ను ఎగవేత తగ్గుతుంది. ఆర్థిక వ్యవస్థలో నల్లధన ప్రవాహానికి అడ్డుకట్ట పడుతుంది. ఆదాయపన్ను తగ్గింపు ప్రకటన దేశంలోని మధ్యతరగతి ప్రజలపై అత్యధికంగా ప్రభావం చూపుతుంది. ఇది గొప్ప ప్రకటన. నల్లధనం, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం నిరంతరం సాగుతుంది. రాజకీయ విరాళాలపై దేశంలో విస్తృతంగా చర్చ జరుగుతూ వస్తోంది. ఇందులో రాజకీయ పార్టీలు కేంద్ర బిందువులుగా ఉంటున్నాయి. ఎన్నికల కోసం విరాళాల సేకరణకు ఆర్థికమంత్రి కొత్త పథకం తీసుకొచ్చారు. నల్లధనంపై పోరాటానికి దేశ ప్రజలు వ్యక్తంచేస్తున్న ఆశ, ఆకాంక్షలను ఇందులో ప్రతిబింబింపజేశారు. ఉపాధి కల్పనలో సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకోసం పన్నును తగ్గించాం. చిన్న పరిశ్రమలు ప్రపంచ మార్కెట్‌తో పోటీపడటానికి ఈ నిర్ణయం చాలా ఉపయోగపడుతుంది."

**–నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

# అన్ని రంగాలకు సమ ప్రధాన్యత



70 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో అన్ని రంగాలకు సమానమైన ప్రాముఖ్యత కల్పిస్తూ నిధులు కేటాయించిన తొలి బడ్జెట్ ఇదే! మూస పోసిన పాత పద్దతులకు స్వస్తి పలికి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడేలా బడ్జెట్ రూపకల్పన చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఉపాధి అవకాశాలను మొరుగుపరిచే దిశగా ఈ బడ్జెట్ ఉంది.

మౌలిక వసతుల కల్పనలో భాగంగా రైల్వేలు, షిప్పింగ్, రహదారుల అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించడం వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి. అలాగే రాబోయే రోజుల్లో కోటి గృహాలను నిర్మించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడం కార్మికలోకానికి శుభవార్తలాంటిది. ఈ నిర్ణయం వల్ల నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతాయి. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కోడ్ ఆన్ వేజెస్, కోడ్ ఆన్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, కోడ్ ఆన్ హెల్త్ అండ్ సేఫ్టీ... కార్మిక మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ నాలుగు కోడ్లకు బడ్జెట్‌లో ఆమోదముద్ర వేయడం కార్మికలోకానికి శుభ పరిణామం. మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లను ఐదువేలకు పెంచడం వల్ల ఇఎస్ఐసి బోధనాసుపత్రుల్లో సీట్లు రెండింతలు అయ్యే అవకాశం ఉంది. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ యోజన పథకానికి రూ.23వేల కోట్లు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకానికి రూ.19వేల కోట్లు కేటాయించడం గ్రామీణ భారతం పురోగమించడానికి దోహదపడటమే కాకుండా లక్షల మందికి ఉపాధి అవకాశాలను తెచ్చిపెడుతుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మనుపెన్నడూ లేని విధంగా 48వేల కోట్ల రూపాయలు కేటాయించడం అత్యంత శుభపరిణామం. దీనివల్ల బడుగు, బలహీన వర్గాలకు ప్రతిరోజు పని దొరికే అవకాశం ఉంటుంది."

– బండారు దత్తాత్రేయ, కేంద్ర కార్మిక

# దశాశ్వమేధయాగం



"కేంద్ర బడ్జెట్ దేశాన్ని పునరుత్తేజపరిచే దశాశ్వమేధయాగం వంటిది. "సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్" అనేది ప్రధాని మోదీ సంకల్పం. ఆయన సంకల్పానికి అనుగుణంగానే అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇది విప్లవాత్మకమైన.. దేశాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో వేగంగా ముందుకు తీసుకెళ్లే బడ్జెట్. వివిధ సామాజిక వర్గాలకు సాధికారత కల్పించి.. వారు దేశ నిర్మాణానికి తమ పూర్తి శక్తి సామర్థ్యాలను వినియోగించేందుకు ఈ బడ్జెట్ తోడ్పడుతుంది. ప్రజల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూనే మౌలిక సదుపాయాలకు భారీ ఎత్తున నిధులు కల్పించారు. అత్యంత కీలకమైన 10 అంశాలను బడ్జెట్‌లో ప్రవేశపెట్టారు. అల్పాదాయ వర్గాలకు, చిన్న ఉద్యోగులకు పన్ను ప్రోత్సాహకాలున్నాయి. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విధంగా గృహ నిర్మాణానికి మౌలిక సదుపాయాల హోదా కల్పించడంతో పాటు 30 శాతం పన్ను రాయితీ కల్పించడం ముదావహం. 2022 నాటికి దేశంలో అందరికీ ఇళ్లు లక్ష్యాన్ని సాధించేందుకు ఈ చర్య దోహదపడుతుంది. నల్లధనం ఉన్నవారు, అవినీతిపరులు, పన్నులు ఎగ్గొట్టేవారిపై కఠినచర్యలు చేపట్టి నిజాయతీపరులకు మద్దతునిచ్చే బడ్జెట్ ఇది. చిన్న పారిశ్రామిక సంస్థలకు భారీ ప్రోత్సాహకాలున్నాయి. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే విధానంలో విప్లవాత్మక మార్పులు చేపట్టి అత్యంత కీలకమైన ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం జరిగింది.

దేశంలో భారీఎత్తున డిజిటల్ విప్లవం రానుంది. 15వేల డిజిటల్ గ్రామాలు ఏర్పాటు కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములిచ్చిన వారికి క్యాపిటల్ గెయిన్ కింద పన్ను మినహాయింపు లభించడం ఆనందదాయకం. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రానికి ప్రత్యేకశ్రద్ధ ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం"

**ఎం.వెంకయ్య నాయుడు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి**

# పేదల సంక్షేమమే ధ్యేయం



"బడ్జెట్ 2017-18 విప్లవాత్మకమైంది.. సాహసోపేతమైంది.. చారిత్రాత్మకమైంది.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఉంది. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని అనుసరించి నిరుపేదలకు సైతం అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యం ఇందులో కనిపిస్తోంది. ఉపాధి హామీ పథకానికి నిధులు పెద్దఎత్తున కేటాయించడం, యువత ప్రాధాన్యాన్ని గుర్తించి వారికి నైపుణ్య శిక్షణా కేంద్రాలను పెద్ద ఎత్తున పెంచడం లాంటి నిర్ణయంతో ఆర్థిక వ్యవస్థ అసాధారణ స్థితిలో మెరుగుపడుతుంది. పారదర్శకమైన నిజాయితీతో కూడిన రాజకీయాల కోసం సంస్కరణలు తేవడం విప్లవాత్మకం. గ్రామీణ ప్రాంతాన్ని, వ్యవసాయ రంగాన్ని, పేదలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్‌ను దేశ ప్రజలందరూ స్వాగతిస్తున్నారు. ఇలాంటి బడ్జెట్ తీసుకొచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశానికి ఒక స్ఫూర్తి నాయకుడుగా చరిత్రలో నిలిచిపోతారు."

**డా॥ కె.లక్ష్మన్, బిజెపి తెలంగాణ అధ్యక్షుడు**

# ఇది కలల బడ్జెట్



"గ్రామీణులు, వ్యవసాయదారులు, యువప్రొఫెషనల్స్ అభివృద్ధికి దోహదపడేవిధంగా ఈ బడ్జెట్ ఉంది. ఈ బడ్జెట్‌తో పేదలు, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారమవుతుంది. 2014లో ఎన్నికల్లో బిజెపి హామీ ఇచ్చినవిధంగా పారదర్శకత, అవినీతిరహిత వ్యవస్థ నిర్మాణానికి తోడ్పడుతుంది. నల్లధనం వల్ల కలిగే అవినీతి తదితర దుష్పరిమాణాలను అరికట్టేలా ఉంది. రాజకీయ పార్టీలకు నగదు రూపంలో ఇచ్చే విరాళాలను రూ.20వేల నుంచి రూ.2వేలకు కుదించడం మహత్తర నిర్ణయం. ఇలాంటి చర్య తీసుకున్న ప్రధానమంత్రికి అభినందనలు. వ్యవసాయరంగానికి అధిక ప్రాధన్యత ఇచ్చి రైతులకు రుణాలు ఇచ్చేందుకు రూ.10 లక్షల కోట్లు కేటాయించడం వారి ఆదాయం రెట్టింపు చేసే దిశగా ముందడుగు. ఫసల్ బీమా యోజనకు అధిక కేటాయింపులు జరపడం, పంటలకు మద్దతు ధర కల్పించడం రైతులకు మేలు చేకూరుస్తుంది. సాగునీటి వసతి పెంచేందుకు చిన్న, మధ్యతరహా నీటి ప్రాజెక్టుల నిర్మణానికి కేటాయింపులు పెంచడం రైతులతో పాటు దేశానికి మేలు చేస్తుందన్నారు.

ముద్ర యోజనకు కేటాయింపులు పెంచడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విద్య, వైద్యం, రక్షణ రంగం, ఉపాధి హామీ పథకం, గ్రామీణ విద్యుదీకరణ, రైల్వేలు, రహదారులు, పారిశ్రామికం... ఇలా అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యం దక్కింది. అన్ని రంగాల అభివృద్ధితో పాటు ద్రవ్యోల్బణాన్ని 3.2 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గొప్ప విషయం. అన్ని వర్గాలకు మేలు చేసే ఇలాంటి అభివృద్ధి బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి బిజెపి, 130 కోట్ల భారతీయుల తరపున ధన్యవాదాలు చెప్తున్నాను."

**అమిత్ షా, బిజెపి జాతీయాధ్యక్షుడు**



వ్యర్థమైన మాటలు వేల కన్నా, సార్థకమైన మాట ఒక్కటి చాలు. – గౌతమ బుద్ధుడు

అసూయ అగ్నికణం వంటిది. అది అంటుకున్న వారిని దహించేస్తుంది. – గౌతమ బుద్ధుడు

# కేరళలో బిజెపి కార్యకర్తలపై హత్యా కాండ

కేరళలో బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తలపై కొనసాగుతున్న హత్యా కాండపై బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర రావు, కేరళ శాసన సభ్యుడు, బిజెపి నాయకుడు ఓ.రాజ్ గోపాల్ ఇటీవల గవర్నర్ పి. సదాశివన్‌ను కలిసి చర్చించారు.

కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ హయాంలో శాంతి భద్రతల దుస్థితిపై వీరు గవర్నర్‌కు వివరించారు. కేరళలో సీపీఎం నాయకత్వంలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హింసాకాండను ఒక విధానంగా అమలు చేస్తున్నారు. సీపీఎం కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా హింసాకాండకు పాటుపడుతున్నారు. సైద్ధాంతిక విభేదాలను బొత్తిగా సహించడం లేదు. కిరాతకమైన విధానాలు అనుసరిస్తున్నారు. పరిపాలనా విభాగం కూడా నేరమయం అవుతోంది. పినరాయ్‌కి, పార్టీకి, పోలీసులకు మధ్య ప్రమాదకరమైన సంబంధం కొనసాగు తోంది. భయోత్పాతం సృష్టించడానికి, రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించడం జోరుగా కొనసాగుతోంది. కేరళ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం అన్న ఆదర్శాలు ఎక్కడా కనిపించడం లేదు.



ఇది పాలనలో కూడా వ్యక్తం కావడం వల్ల పరిపాలన పూర్తిగా విఫలమవుతోంది. అభివృద్ధి గురించి ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నా శాంతిభద్రతలు లేకుండా అది సాధ్యం కాదని, అభివృద్ధి సాధించాలన్న లక్ష్యం ఎండమావిగా మిగిలిపోక తప్పదని బిజెపి నాయకులు గవర్నర్‌కు తెలియజేశారు. సీపీఎం కార్యకర్తల చేతిలో హతమైన వారిలో ఎక్కువ మంది దళితులే ఉండడం సీపీఎం రెండు నాల్కల ధోరణికి ప్రతీక. సీపీఎం వర్గ పోరాటం గురించి గొప్పగా చెప్తున్నా ఆచరణలో మాత్రం అది రాజకీయ కక్ష సాధింపుగా మిగిలిపోతోంది.

ఈ నేపథ్యంలో బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తల మీద కొనసాగుతున్న హత్యాకాండను పరిశీలించాలని బిజెపి నాయకులు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

అంతకు ముందు ఈ ప్రతినిధి బృందం నెయ్యాంతికరలో సీపీఎం కార్యకర్తల చేతిలో హతమైన బిజెపి కార్యకర్త అనిల్ కుటుంబాన్ని పరామర్శించింది. సీపీఎం గూండాల దాడికి గురైన బిజెపి మహిళా కార్యకర్త ఆషా షెరిన్‌ను కూడా పరామర్శించింది. సీపీఎం అధ్వర్యంలో జరుగుతున్న ఈ హింసాకాండను ప్రజా స్వామ్యవాదులు ఖండించ వలసిన అవసరం ఉంది.

ప్రతిపక్షాలపై దాడి సహింపరానిది. ఈ దౌర్జన్యం కేరళకు మాత్రమే పరిమితమైంది కాదు. చివరకు ఇది కమ్యూనిస్టు ప్రభుత్వ అంతానికి దారి తీస్తుంది. ఈ సంఘటనలపై వివరాలు సేకరించి ప్రజలకు తెలియజెప్పాలని బిజెపి ఆలోచిస్తోంది. కేవలం కేరళలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఈ పని చేయాలని బిజెపి భావిస్తోంది.

**–జనసందేశ్ ప్రతినిధి**



బిజెపి జనగామ జిల్లా కార్యాలయంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి జనగామ జిల్లా అధ్యక్షుడు కె.వి.ఎల్.ఎన్.రెడ్డి, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆగయ్య, జనగామ వైస్ ఛైర్మన్ నాగరపు వెంకట్, శివరాజ్ యాదవ్, సయ్యద్ అఫ్జల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్ రావు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సికిందర్ అలీ సమక్షంలో 100 మంది మైనార్టీ నాయకులు, యువకులు బిజెపిలో చేరారు. బిజెపి బలోపేతానికి కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.



జీవితమనే యుద్ధరంగంలో ధైర్యంగా పోరాడే సైనికుని శక్తి, స్ఫూర్తి మనకిప్పుడు కావాలి. – స్వామి వివేకానంద

# సవాలుకు సిద్ధం: వాజ్‌పేయి

**ఇది 1968 ఫిబ్రవరి 18న ప్రయాగలో జరిగిన పండిత దీన్‌దయాళ్ అంత్యక్రియలల్లో వాజ్‌పేయి చేసిన ప్రసంగంలో భాగం. ఇది సుధాకర్ రాజే సంపాదకత్వంలోని "పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం" అన్న గ్రంథంలోనిది.**

రండి, పండిట్ జీ చిందించిన రక్తపు బొట్లు మన నుదుటిని అలకరించి లక్ష్యసాధన దిశగా మనకు స్ఫూర్తి కలిగించాలి. ఆయన చితి నుంచి వెలువడిన రవ్వలను మన ఎదలో నిలుపుకోవాలి. కష్టపడి పని చేయాలి.

దధీచి లాంటి పండిట్ జీ ఎముకలు పిడుగుల్లా మారాలి. ఆ పిడుగులు మనకాలపు అసురులను అంతమొందించాలి. ఈ పవిత్ర భూమిని అన్ని రకాల ప్రమాదాల నుంచి కాపాడాలి. నందా దీపం ఆరిపోయింది. అందువల్ల మన జీవితాలు దగ్ధం చేసి చీకట్లను పారదోలాలి. చంద్రుడికి గ్రహణం పట్టింది. మిణుకు మిణుకుమనే నక్షత్రాల వెలుగులో ముందుకు సాగాలి. మన నాయకుడు, మిత్రుడు, సహచరుడు, మార్గదర్శి లేకపోయినా ముందుకు సాగాలి. మనం పురోగమిస్తున్న కొద్దీ ఆయన మన గుండెల్లో వెలుగుతుంటారు. పండిట్ జీ ది సమాజానికి అంకితమైన జీవితం. ఆయన జీవితంలోని ప్రతి క్షణం, ఆయన శరీరంలోని ప్రతి అణువు జాతి సేవకే అంకితం చేశారు. ఈ జాతే ఆయనకు దైవం. ఈ దేశమంతా ఆయన ఇల్లే, ప్రజలందరూ ఆయన కుటుంబమే.

ఆయన కళ్లల్లో ఉన్నది ఒకటే వెలుగు, ఆయన శపథం ఒక్కటే. రాజకీయాలు ఆయనకు ఒక మార్గమే కాని అవే అంతిమం కాదు. అవి మార్గమే తప్ప లక్ష్యం కాదు. ఆయన రాజకీయాలకు ఆధ్యాత్మికత ఆపాదించాలనుకున్నారు. ఆయన దేశ గత చరిత్ర నుంచి స్ఫూర్తి పొందారు. ఎందుకంటే ఆయన ఉజ్వల భవిష్యత్తు ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తి పొందింది మన జాతీయ సంస్కృతి నుంచే అయినా ఆయన సంప్రదాయవాది కాదు. దేశాన్ని సుసంపన్నం చేసి ఆధునిక భారత నిర్మాణానికి కావాల్సిన పునాదులు వేయాలనుకున్నారు. ఆయన గొప్ప ఆలోచనాపరుడు.

ఆయన ఆలోచన ఎన్నడూ అందుబాటులో ఉన్న సరుకుకు పరిమితమైనవి కాదు. మన గతాన్ని చూసి గర్వపడమని చెప్తూనే భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని చెప్పారు. ఈనాటి జనసంఘ్ ఆయన చలవే. ఏ పదవీ ఆయనను ప్రలోభపెట్టలేదు. ఆయన ఎన్నడూ పార్లమెంటు సభ్యుడు కాకపోయినా అలాంటి వారిని తయారు చేశారు. ఆయన ఏనాడూ పదవులు కోరుకోలేదు. జనసంఘ్ అధ్యక్షుడిగా ఉండడానికి అనేక విధాలుగా నచ్చచెప్పాల్సి వచ్చింది. "వింధ్య పర్వతాలు దాటి సముద్రం మాతృ దేశం పాదాలు కడిగేదాకా విస్తరించాలి," అని చెప్పేవారు. సమైక్య మంత్రంతో ప్రజలను ఐక్యం చేయాలని చెప్పారు.



**ఫిబ్రవరి 11న దీనదయాళ్ జీ వర్ధంతి సందర్భంగా ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు బిజెపి-తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సమర్పణ దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తుంది.**

ఆయన నాయకత్వంలోనే మనం సమైక్యత కోసం పాటు పడుతున్నాం. ఆయన నాయకత్వంలోనే కాలీకట్‌లో పార్టీ మహాసభను విజయవంతంగా నిర్వహించుకోగలిగాం. ఆ మహాసభ ద్వారానే జనసంఘ్ అనే చరిత్రాత్మకమైన దీక్షను ప్రజలకు అందించాం. అది ప్రజలకు కొత్త ఆశలు, కొత్త విశ్వాసం కలిగించింది. దేశవిదేశాల్లోని వారు ఆయన నుంచి స్ఫూర్తి పొందారు. పార్టీలో పరిణామం సాధ్యమైంది అని జనం అనుకుంటారు. కాని అది తప్పు. పరిణామం జనసంఘ్‌లో రాలేదు. వారి దృష్టిలో వచ్చింది. ఈ దృష్టి పాపంతో, అనూయతో, ఆగ్రహంతో, దౌర్జన్యంతో నిండింది.

మనం సాధించిన ఈ విజయాన్ని వారు సహించలేక పోయారు. అందుకే పండిట్ జీని మన మధ్య లేకుండా చేశారు. ఆయన మరణించిన పరిస్థితి ఏమిటో ఎవరికీ తెలియదు. ఏ వ్యక్తి ఒక్క పిలుపు ఇస్తే వందలాది మంది, వేలాది మంది తమ జీవితాలు అర్పించడానికి సిద్ధపడే వారో ఆ వ్యక్తి మనకు దూరమయ్యారు.

ఈ వాస్తవాన్ని మనం ఎన్నడూ విస్మరించ కూడదు. ఈ బాధ మన గుండెల్లో ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుంది. ఇది మన హృదయాలను ఎప్పుడూ తొలుస్తూనే ఉంటుంది. ఆయన తన దీక్ష కోసమే జీవితాన్ని అర్పించారు. కాని ఆయన కల ఇప్పటికీ నెరవేరలేదు. ఆయన ప్రారంభించిన పని పూర్తి కానే లేదు. ఆయన జీవితం మీద జరిగిన దాడి ఈ జాతి జనుల మీద జరిగిన దాడి. ఆయన శరీరం మీద కలిగిన గాయం ప్రజాస్వామ్యం మీద జరిగిన దాడే. జాతికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకులైన వారు విసిరిన ఈ సవాలును మనం అంగీకరిస్తాం. ■



సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలో జనవరి 23, 24న రెండురోజుల పాటు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ శిక్షణ శిబిరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.




# హాఫిజ్ సయీద్ - పాకిస్థాన్ హౌదినీ ఇంద్రజాలం

• సుధా కస్తూరి

చాలాకాలం క్రితం హౌదినీ అని ఒక మెజిషియన్ ఉండేవాడు. ఆయన ప్రజలందరూ చూస్తూండగా ఏనుగును మాయం చేసేవాడు. ఒక పెద్ద పెట్టెలో ఏనుగును పెట్టేవాడు. తలుపు మూసేవాడు. తెరిచేసరికి ఏనుగు ఉండేది కాదు. పెట్టెకి పెద్ద చక్రాలుండేవి. కాబట్టి ఏనుగు కిందకి దిగితే తెలిసిపోయేది. ఏనుగు వెనకకు నడిచినా తెలిసేది. అలాంటిది ఏనుగు ఉన్నట్టుండి మాయమైపోయేది. ఎలా మాయమైందో చాలాకాలం వరకూ తెలియలేదు. ఇది ఎంత ప్రఖ్యాతి పొందిందంటే దీనిని హౌదినీ యాక్ట్ అని పిలిచేంత.

చివరికి ఇంకో మెజిషియన్ రహస్యాన్ని చాలాకాలం పరిశోధించిన తరువాత ఛేదించగలిగాడు. అదేమిటంటే పెట్టెలో రెండు అరలుండేవి. ఏనుగు ఒక అరలో ఉండేది. ఖాళీగా ఉన్న రెండో అరను చూపించి హౌదినీ ప్రేక్షకులను నమ్మించేవాడు.

ఈ హౌదినీ యాక్ట్‌లో ఆరితేరిన దేశం పాకిస్థాన్. కావాలనుకున్నప్పుడు కరడుగట్టిన ఉగ్రవాది హాఫిజ్ సయీద్‌ను అరెస్టు చేయగలదు. ప్రపంచ దేశాలకు ఉగ్రవాద పోరులో తన చిత్తశుద్ధిని నిరూపించుకోగలదు. ఆ తరువాత కోర్టు సాయంతో హాఫిజ్ సయీద్‌ను విడిచిపెట్టగలదు. హాఫిజ్ సయీద్ జైలులో ఉన్నాడా అంటే ఉన్నట్టు. లేడా అంటే లేనట్టు. పాకిస్థాన్ ఈ మాయాజాలాన్ని హౌదినీ కన్నా గొప్పగా చేయగలదు.

తాజాగా హాఫిజ్ సయీద్, ఆయన నలుగురు ప్రధాన అనుచరులు అబ్దుల్లా ఒబేద్, జాఫర్ ఇక్బాల్, అబ్దుర్ రహమాన్ ఆబిద్, కాజీ కషిఫ్ నియాజ్‌ల గృహనిర్బంధం కూడా ఈ హౌదినీ యాక్ట్‌లో భాగమే. అందుకే భారత్ సహా ప్రపంచ దేశాలు పాకిస్థాన్‌ను నమ్మడం లేదు.

హాఫిజ్ సయీద్‌ను భారత పార్లమెంటుపై దాడి జరిగినప్పుడు 2001 డిసెంబర్ 21న అరెస్టు చేసింది. కానీ మార్చి 31, 2002లో విడుదల చేసింది. మే 31, 2002న అరెస్టు చేసింది. అక్టోబర్ 31న విడుదల చేసింది. ఆగస్టు 9, 2006లో అరెస్టు చేసింది. అక్టోబర్ 17, 2006న విడుదల చేసింది. 2008 ముంబై దాడుల తరువాత అరెస్టు చేసింది. తరువాత విడిచిపెట్టింది. 2009లోనూ ఇదే నాటకం ఆడింది. తమాషా ఏమిటంటే ఒక్కసారి కూడా క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయలేదు. అంటే కేసు ముందుకు సాగనే లేదు.

హాఫిజ్ సయీద్ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం 1267 ప్రకారం అంతర్జాతీయ తీవ్రవాది. భారత్ చెప్పినందుకు ఆయన తీవ్రవాది కాలేదు. ప్రపంచం, ప్రపంచదేశాల అత్యున్నత సమాఖ్య ఆయనను తీవ్రవాదిగా గుర్తించింది. భారత్ మాత్రమే కాదు అమెరికా కూడా 2008 నుంచి అతడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూనే ఉంది. పాకిస్థాన్ హౌదినీ యాక్ట్ ద్వారా ప్రపంచాన్ని మభ్యపెడుతూనే ఉంది.

హాఫిజ్ సయీద్ కూడా లష్కరె తోయబాను నిషేధించగానే చొక్కా మార్చేశాడు. సంస్థ పేరును జమాతుద్దావాగా మార్చేశాడు. జమాతుద్దావా ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు రాగానే ఫలా ఇ ఇన్సానియత్ అన్న పేరు పెట్టేసుకున్నాడు. ఇప్పుడు తాజాగా సయీద్ మళ్లీ గృహనిర్బంధంలో ఉండే సరికి సంస్థ పేరు మళ్లీ మారిపోయింది. తహరీకె ఆజాదియే జమ్మూ కశ్మీర్ అన్న పేరు పెట్టుకుంది. ఫిబ్రవరి 4న పాకిస్థాన్‌లో జరిగిన పడవ ప్రమాదంలో హాఫిజ్ సయీద్ అనుచరులు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. అదీ ప్రభుత్వంతో కలిసి. కాబట్టి సయీద్ మారలేదు, సయీద్ సంస్థ పేరు మాత్రమే మారింది. కాబట్టి ఆయన అరెస్టు.. అరెస్టు కాదు. ఆయన సంస్థపై నిషేధం.. నిషేధం కాదు. పాకిస్థాన్ ఆలోచనలో మార్పు రాలేదు.

నిజానికి పాకిస్థాన్ పశ్చిమాన హక్కానీ నెట్‌వర్క్‌ను, తూర్పున హాఫిజ్ సయీద్‌ను తమ వ్యూహాత్మక ఆయుధాలుగా భావిస్తుంది. వారిని అలా ఉపయోగించుకుంటుంది. ఈ అభిప్రాయం మారనంత వరకూ పాకిస్థాన్ మారినట్టుగా భావించలేం.

ప్రస్తుతం అటు అమెరికా, ఇటు చైనాల ఒత్తిడి వల్ల మాత్రమే పాకిస్థాన్ హాఫిజ్ సయీద్‌ను అరెస్టు చేసిందన్నది సుస్పష్టం. ఒబామా వెళ్తూ వెళ్తూ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశాడు. ట్రంప్ దూకుడు అనూహ్యంగా ఉంటుంది కాబట్టి ఏదైనా జరగవచ్చునన్న భయం పాకిస్థాన్‌ను పట్టిపీడిస్తోంది. అమెరికాలోకి ఏడు ముస్లిం దేశాల ప్రజల రాకను నిరోధిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలికంగా కోర్టు బ్రేక్ వేసినా ఈ ఆదేశాలు ఏదో ఒకరూపంలో కొనసాగటం ఖాయం. ట్రంప్ ఆర్థిక సాయాన్ని ఆపివేస్తే పాకిస్థాన్ ఆకలితో అలమటించిపోయే పరిస్థితులున్నాయి. మరోవైపు చైనా హాఫిజ్ సయీద్ విషయంలో రెండు సార్లు ఐరాసలో వీటో పవర్‌ను ఉపయోగించినా, పునరాలోచనలో పడింది. భారతదేశంలో కోల్‌కతా చైనా దౌత్య కార్యాలయంలో కౌన్సుల్ జనరల్‌గా గతంలో పనిచేసిన మావో సివెయ్ ఈ మధ్య తన బ్లాగ్‌లో హాఫిజ్ సయీద్ విషయంలో చైనా వ్యూహాన్ని విమర్శించాడు. చైనాలో ఇలాంటి విమర్శలు పైనుంచి అనుమతి లేనిదే జరగవు. కాబట్టి చైనా కూడా పాకిస్థాన్‌తో యుద్ధమే జరిగితే చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ప్రమాదంలో పడుతుందన్న భయంతోనే హాఫిజ్ సయీద్ విషయంలో పాక్‌ను హెచ్చరించింది. పాకిస్థాన్ చర్యను కేవలం ఒత్తిడిలో తీసుకున్న చర్యగా, ఉన్న ఇద్దరు మిత్రులూ వెళ్లిపోతారన్న భయంతో తీసుకున్న నిర్ణయంగా భావించాలి తప్ప పాక్ మనసు మారినట్టు భావించ కూడదు.

అంతే కాదు. ఈ సమయంలో భారత్‌తో చర్చలు జరపడం పాకిస్థాన్‌కు అవసరం. పాకిస్థాన్ బలహీనంగా ఉంది కాబట్టి చర్చల పేరిట కాలయాపనచేసి, మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగానే హాఫిజ్ సయీద్ విషయంలో హౌదినీ యాక్ట్ మొదలుపెట్టింది. మోదీ ప్రభుత్వం దీన్ని గుర్తించింది కాబట్టే పాకిస్థాన్‌ను కట్టడి చేసే అవకాశంగా మాత్రమే దీన్ని చూస్తోంది. ■



ఎక్కువగా పనిచేయడం, తక్కువగా తినడం, మితంగా మాట్లాడ్డం మంచివారి లక్షణాలు. - జగన్నాథ పండితుడు

# క్షేత్రం ఏదైనా మన లక్ష్యం ఒకటే!

● శివరాం

ఒక కర్మాగారంలో కార్మికులు ఒక మంచి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం కుదిరినాక ఇతర యూనియన్ కార్యకర్తలు తమ నాయకుడికి ఒక కారు కొని ఇచ్చారు. అప్పుడు చాలా మంది కార్మికులు మన భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యకర్త వద్దకు వచ్చి " మీకు కూడా ఒక కారు కొనివ్వాలనివేము అనుకుంటున్నాం'' అనసాగారు. దానికి జవాబుగా మన కార్యకర్త 'కారు నిరర్ధకంబీ నాకు వద్దు. ఆ కారును ఎవరు శుభ్రం చేస్తారు! నాకు సైకిలే చాలు.' అన్నాడు.

పూర్తి సమయం ఇచ్చి పనిచేస్తున్న మన కార్యకర్తలు ఇచ్చిన ఇంటర్వ్యూలను మేము చాలా చూస్తున్నాం. వారందరూ కూడా "మాకు లభిస్తోన్న సొమ్ము మాకు చాలు. దీనితో మాకు గడిచి పోతుంది. మాకు ఇచ్చేదాన్ని పెంచనవసరం లేదు." అని ఇంటర్వ్యూలలో చెప్పారు. వాళ్ళు చెప్పే అనుభవాలను వింటున్నప్పుడు "ఎంత విశాలమైన ఆలోచనలు గలవారితో కలిసి మనం పని చేస్తున్నాం." అనిపిస్తుంది. పూర్తి సమయం ఇచ్చి పనిచేస్తున్న ఒక కార్యకర్త మా వద్ద కొంత జీతం పుచ్చుకొంటూ ఉండే వాడు. కాని ఏదో కారణం వల్ల అతనికి డబ్బు తీసుకునే అవసరం లేని పరిస్థితి ఏర్పడింది. అతడు " వచ్చే నెల నుండి భారతీయ మజ్దూర్ సంఘ్ నుండి నాకు ఏ విధమైన జీతమూ అక్కర్లేదు." అని చెప్పాడు. అంతకు ముందు కూడా మాకు " మనం ఎంత తక్కువ ఇస్తున్నాం!" అని సిగ్గుగా ఉండేది. కాని ఇప్పుడు అతనే వచ్చి తనకు ఆ సొమ్ము కూడా అక్కర్లేదు అంటున్నాడు. ఎంత శ్రేష్ఠమైన మనస్తత్వం?! ఎముకలను చర్మాన్ని కలిపి ఉంచేందుకు కండ కనీసం ఎంత అవసరమో అది ఉంటే చాలు అనేదే జీవన స్థాయి గురించి మన భావన.

మొత్తం క్షేత్రాన్ని గురించి ఆలోచించాలిః మన కార్యకర్త అన్య క్షేత్రాలలో పనిచేసేందుకు వెళ్ళినపుడు అతని మనసులో తన సంస్థ గురించి మాత్రమే కాక మొత్తం క్షేత్రం గురించిన ఆలోచన నెలకొనాలి. మనం సంపూర్ణ సమాజంతో ఏకాత్మతను కలిగి ఉండాలి. కనుక



ఇతర క్షేత్రాలలోకి వెళ్ళిన మన కార్యకర్తల మనో దృష్టి కూడా వర్గ భావనతో పరిమితం కాకూడదు. వారిలో తమ సంస్థల విషయంలో సంస్థాగత అహంకారం నిర్మాణం కాకూడదు.

సంఘ స్వయం సేవకులు కొందరు కమ్యూనిస్టులు నడిపే యూనియన్లలో పని చేస్తుండడం గురించి పూ. గురూజీకి "స్వయం సేవకులై ఉండి కూడా భారతీయ మజ్దూర్ సంఘ్‌కు ప్రత్యర్థులైన యూనియన్లలో ఎలా పని చేస్తారు? వాళ్ళను ఆ పని మాన్పించాలి" అని ఫిర్యాదులు చేయబడ్డాయి.

వాటికి జవాబుగా శ్రీ గురూజీ "అది అన్యక్షేత్రాలలో పనిచేస్తున్న మన కార్యకర్తలకు చాలా ఉపయోగపడుతుంది. సర్‌సంఘ్‌చాలక్ నైన కారణంగా కార్మిక లోకంలో భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యకర్తలు మాత్రమే నావారు అని చెప్పలేనుబీ సర్‌సంఘ్‌చాలక్‌గా మొత్తం సమాజం నాది అని భావిస్తాను. నేను కేవలం సంఘానికి కాదు సంపూర్ణ హిందూ సమాజానికి సర్‌సంఘ్‌చాలక్‌ని. అందుచేత ఏ స్వయం సేవకుడినీ ఇతర సంస్థలలో పనిచేయకుండా నేను అడ్డు పడలేను. ఆ స్వయం సేవకుడు తన రీతి, నీతి, పద్ధతి సార్థకమయ్యే విధంగా పనిచేస్తూ ఉన్నంత వరకూ అతడు ఇతర సంస్థలలో ఉన్నా నేను అడ్డు చెప్పను." అన్నారు.

ఒక సారి ఉత్తర ప్రదేశ్ సంఘ శిబిరంలోకి పండిట్ దీనదయాళ్జీ భోజనానికి వచ్చారు. అప్పుడాయన భారతీయ జనసంఘ్‌లో పనిచేస్తున్నారు. శిబిరంలో పాల్గొంటున్న ఒక స్వయం సేవక్ ఆయన్నిలా అడిగాడు "పండిట్‌జీ ఇప్పుడు రాబోయే ఎన్నికల్లో మనవాళ్ళు ఎంత మంది గెలుస్తారు?" స్వయం సేవకునిగా నువ్వు అడుగుతున్నట్లయితే గెలవబోయే వాళ్ళందరూ మనవాళ్ళే" అన్నారు పండిట్‌జీ. ఏ క్షేత్రంలో పనిచేసే స్వయం సేవకుని మనసులో అయినా ఆ క్షేత్రం మొత్తం తనదే అన్న భావన ఉండాలని ఆయన చెప్పకనే చెప్పారు. రాజకీయ క్షేత్రంలో కూడా మన రాజకీయ పార్టీకి చెందని వారిని హిందూ రాష్ట్రానికి చెందని వారుగా మనం భావించం అని దాని అర్థం.

వివిధ క్షేత్రాలలో మన సంస్థలను వృద్ధి చేసేందుకు మనం ప్రయత్నించేటప్పుడు ఆ యా సంస్థలలో పని చేస్తున్న అన్యసంస్థల కార్యకర్తలతో మనకు విరోధాలు తలెత్తడం సహజమే. మన సంస్థ అవసరం కొద్దీ మనమూ విరోధించ వలసి ఉంటుంది. కానీ ఆ సమయంలో కూడా "ఏదో తప్పు అవగాహన వల్ల వీళ్ళు ప్రస్తుతం మనతో విరోధ పడుతున్నారుబీ కానీ భవిష్యత్తులో మనం వీళ్ళను కూడా కలుపుకుని పని చేయవలసి ఉంటుంది" అన్న విషయం గుర్తుంచుకోవాలి. వాళ్ళు తప్పు పద్ధతిలో మనకు కీడు చేస్తున్నట్లయితే తప్పని పరిస్థితుల్లో మనం వారిపై కూడా దెబ్బ తీస్తాం. కాని అది విద్వేష భావనతో కాదుబీ మాతృ వాత్సల్యంతో. తల్లి చేదు మందు త్రాగిస్తుంటే ఆ పిల్ల వాడు తల్లిని కొడతాడుబీ మందు తాగించేందుకు ఆ తల్లి కూడా పిల్లవాడిని ఒక దెబ్బ వేస్తుంది. అది ద్వేషంతో కాదుబీ పిల్లవాడికి మంచి జరగాలన్న భావనతోనే. అదే విధంగా సామాజిక రంగంలో మనని వ్యతిరేకించే వారు కూడా లోలోపల మన విత్తనాలు కలిగిన కార్యకర్తలేబీ కేవలం తప్పుడు అవగాహన వల్ల వారు ఈనాడు మనల్ని వ్యతిరేకిస్తున్నారు. ఆద్యతన భావిలో విత్తనాలు మొలకెత్తి మన దారికి వస్తారు అన్న భావన మన మనసులో ఉండాలి. అన్య క్షేత్రాలలోకి వెళ్ళే మన కార్యకర్తలలో ఆ యా క్షేత్రాలలో చేయవలసిన పనియొక్క ప్రణాళిక మన సిద్ధాంతాల, ఆదర్శాల వెలుగులోనే ఉండాలనే స్పష్టమైన ధృఢమైన భావన, క్షేత్రం ఏదైనా మన లక్ష్యం ఒకటే అన్న అవగాహన ఉండాలి.

**ఆధారం కార్యకర్త, దత్తోపంత్‌ఠేంగ్డే**

పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. – గాంధీ

మనమాట



# పాలకుల పాపం ఉస్మానియాకు శాపం



జి. కిషన్ రెడ్డి
బిజెపి శాసనసభా పక్ష నేత

విద్యాకుసుమాలు విరబూసిన క్షేత్రం.. ప్రధానమంత్రి సహా ఎందరో నాయకులను, మేధావులను అందించిన విశ్వవిద్యాలయం.. పరిశోధనలకు కేంద్ర స్థానం.. ఉద్యమాలకు పురిటిగడ్డ.. దేశంలోని అత్యుత్తమ విశ్వ విద్యాలయాల సరసన నిలిచిన చరిత్ర.. ఇదీ చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం గతవైభవం.

న్యాక్ ర్యాంకింగ్‌ను కొనసాగించలేని దుర్దశ... రెండేళ్ల పాటు కనీసం వీసీ కూడా లేని వైనం.. తీవ్రమైన సిబ్బంది కొరత.. విద్యార్థులకు వసతుల లేమి.. అడుగడుగునా సమస్యలు.. ఉద్యోగులు రిటైర్ అయిన రెండు సంవత్సరాల వరకు కూడా ప్రయోజనాలు ఇవ్వలేని దుస్థితి... ఇదీ నేడు ఉస్మానియాకు పట్టిన దుర్గతి.

గత వైభవం చూసి మురిసిపోవడమే కానీ ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న ప్రస్తుత తరుణంలో ఈ విశ్వవిద్యాలయం గురించి చెప్పుకునేందుకు వర్తమానంలో సాధించిన ఘనతలేమీ లేవు. ఇందుకు ఉమ్మడి రాష్ట్రంలో నాటి పాలకులు ఎంత కారణమో స్వరాష్ట్రం సాధించుకున్నాక గద్దెనెక్కిన 'మన పాలకులూ' అంతే కారణం.

తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఉస్మానియానే కేంద్రస్థానం. ఓయూ విద్యార్థుల వీరోచిత పోరాటం, అసమాన త్యాగం, లాఠీదెబ్బలకు వెరవని ధీరత్వం, తుపాకీగుళ్లకు చెదరని ధీరత్వం కారణంగా చిరకాల స్వప్నం తెలంగాణ సాకారమైందనడంలో సందేహమేమీ లేదు. రాష్ట్ర సాకారంలో ఇంతటి కీలకపాత్ర పోషించిన ఉస్మానియా పునర్వైభవం సాధిస్తుందని విద్యార్థులతో పాటు సమస్త తెలంగాణ సమాజం ఆశించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆ ఆశలపై నీళ్లు చల్లింది. విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలతో పాటు ఘన చరిత్రను సొంతం చేసుకున్న ఉస్మానియా యూనివర్సిటీనీ భ్రష్టు పట్టించింది. ఓయూ శతవసంతంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఆలస్యంగా కళ్లు తెరచిన సీఎం కేసీఆర్ తూతూ మంత్రంగా వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. శతాబ్ది వేడుకలంటే బిల్డింగులకు రంగులేసి, సున్నాలు కొట్టించి, లైటింగులు పెట్టిస్తే సరిపోతుందని ఈ ప్రభుత్వం భావిస్తున్నట్టు కనిపిస్తుంది. ఎంపీ కేశవరావు కమిటీ వేసిన 3 నెలల తర్వాత కానీ ఈ వేడుకలపై రివ్యూ మీటింగ్ నిర్వహించేందుకు మన ముఖ్యమంత్రి గారికి తీరిక దొరకలేదు. ఈ ఉత్సవాల కోసం ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట.

**శతాబ్ది వేడుకలంటే బిల్డింగులకు రంగులేసి, సున్నాలు కొట్టించి, లైటింగులు పెట్టిస్తే సరిపోతుందని ఈ ప్రభుత్వం భావిస్తున్నట్టు కనిపిస్తుంది. ఎంపీ కేశవరావు కమిటీ వేసిన 3 నెలల తర్వాత కానీ ఈ వేడుకలపై రివ్యూ మీటింగ్ నిర్వహించేందుకు మన ముఖ్యమంత్రి గారికి తీరిక దొరకలేదు. ఈ ఉత్సవాల కోసం ఇంతవరకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం టీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట.**

ఇక ప్రస్తుత ఉస్మానియా యూనివర్సిటీ దుస్థితి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. దేశంలో పేరెన్నిక గన్న యూనివర్సిటీల్లో ఒకటైన ఓయూ 2013లో నేషనల్ అసిస్టెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ న్యాక్ గుర్తింపును పొందడంలో విఫలమైంది. 2013 నుండి న్యాక్ గుర్తింపు రెన్యువల్ చేసుకునే ప్రయత్నంలో యూనివర్సిటీ నిర్లక్ష్యం కారణంగా యూజీసీ నుండి పొందవలసిన నిధులు రావడం లేదు. అయినా మూడేళ్ల వరకు ఈ గుర్తింపు పునరుద్ధరణకు నోచుకోకపోవడం పడిపోతున్న ఓయూ ప్రమాణాలకు అద్దం పడుతుంది. యూనివర్సిటీకి రావాల్సిన యూజీసీ నిధులు రాకుండా పోతున్నాయి. అయినా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలన్న సోయి ఈ ప్రభుత్వానికి లేకుండా పోయింది. దేశానికి ప్రధానమంత్రి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎంత ముఖ్యమో యూనివర్సిటీకి వైస్‌ఛాన్సలర్ అంత ముఖ్యం. యూనివర్సిటీని పర్యవేక్షించే వైస్‌ఛాన్సలర్ లేకుండానే ఓయూ రెండేళ్ల పాటు కొనసాగింది. వీసీ లేని యూనివర్సిటీ పాలన ఎంత అస్తవ్యస్థంగా తయారవుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రెండేళ్ల కాలయాపన అనంతరం వీసీని నియమించినా అదీ సక్రమంగా చేయలేక పోయింది. యూజీసీ నిబంధనలను అతిక్రమిస్తూ వీసీలను నియమించిన టీఆర్ఎస్ ప్రభుత్వం హైకోర్టుతో మొట్టికాయలు వేయించుకుంది. సుప్రీంకోర్టు తుది తీర్పునకు లోబడి వైస్ ఛాన్సలర్ల నియామకం ఉండాలని న్యాయస్థానం నిర్దేశించిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నియమించిన 8 మంది వీసీల పరిస్థితి డోలాయమానంగా మారింది. ఈ 8 మంది వీసీలను ఎప్పుడైనా సాగనంపే అవకాశం ఉంది. పదవి ఉంటుందా, ఊడుతుందా తెలీని పరిస్థితుల్లో వారికి దినదినగండంగా మారింది. ఇక యూనివర్సిటీ ఛాన్సలర్‌గా గవర్నర్ ఉండడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సంప్రదాయాన్ని తుంగలోతొక్కి తమకు అనుకూలురైన బయటి వ్యక్తులను యూనివర్సిటీ ఛాన్సలర్‌లుగా నియమించేలా తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ విషయంలోనూ టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని హైకోర్టు తప్పుపట్టింది. అయినా పద్ధతి మార్చుకోకుండా సుప్రీంకెళ్తే అక్కడా చుక్కెదురైంది. ఓయూకు గత 5 సంవత్సరాల నుంచీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లేదు.

గత 26 సంవత్సరాలలో ఓయూలో కేవలం రెండుసార్లు మాత్రమే నియామకాలు చేపట్టారు. 1990 తర్వాత 17 ఏళ్లకు 2007లో తొలిసారి రిక్రూట్‌మెంట్‌లు చేపట్టారు. అనంతరం 2013లో మరోసారి జరిగింది. రిక్రూట్‌మెంట్ల పరిస్థితి ఇలా ఉంటే రిటైర్మెంట్లు మాత్రం యధావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రం ఏర్పాటైన తర్వాతే గత రెండున్నర



అనుభవాలతో పండిన ముఖబింబం పవిత్రమైన స్థలంలోని ప్రమిదలా వెలుగుతుంది. – బైరన్

సంవత్సరాలుగా 125 మందికి పైగా ప్రొఫెసర్లు రిటైరయ్యారు. ఇతర రాష్ట్రాల్లో యూనివర్సిటీ టీచింగ్ ఫ్యాకల్టీ రిటైర్మెంట్ వయస్సు 65 సంవత్సరాలు ఉంటే తెలంగాణలో మాత్రం 60 సంవత్సరాలే ఉంది. దీంతో ఉస్మానియా యూనివర్సిటీలో బోధనా సిబ్బంది కొరత తీవ్రమయ్యింది. మొత్తం 60 డిపార్ట్‌మెంట్లుంటే 56 డిపార్ట్‌మెంట్లలో సరిపోయినంత బోధనా సిబ్బంది లేదు. 8 డిపార్ట్‌మెంట్లలో బోధనా సిబ్బంది ఒక్కరు కూడా లేరంటే, పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, తమిళ్, థియేటర్ ఆర్ట్స్, బోటనీ, హోమ్ సైన్స్, ఆర్‌సీయూ&ఈఎస్ లాంటి డిపార్ట్‌మెంట్లు మూతపడినట్టే అనుకోవాలి. 42 డిపార్ట్‌మెంట్లలో ప్రొఫెసర్లు లేక అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లతో నెట్టుకొస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లే హెచ్‌ఓడీలుగా కొనసాగుతున్నారు. ఇంజనీరింగ్‌లో ఈసీఈ, బయో మెడికల్ ఇంజనీరింగ్, జియో ఫిజిక్స్, మైక్రోబయాలజీ లాంటి కీలకమైన విభాగాల్లోనూ ప్రొఫెసర్లు లేకపోవడం శోచనీయం.

ఉస్మానియాలో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1264 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం 560 మందే ఉన్నారు. 704 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 290 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ టీచింగ్ స్టాఫ్ 10 శాతం మించి ఉండకూడదు. అయినా ఈ ప్రభుత్వానికి పట్టింపు లేదు. ఉస్మానియాలోనే కాదు రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి. తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో మొత్తం 1524 పోస్టులు ఖాళీగా ఉన్నాయని స్వయంగా సీఎం కేసీఆరే ప్రకటించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారిలో 1300 మందికి పైగా కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్నారు.

ప్రొఫెసర్లు లేకపోవడంతో యూనివర్సిటీలో పరిశోధనలూ అటకెక్కాయి. పీహెచ్‌డీ అడ్మీషన్ల కోసం 2013లోనే ఇవ్వాల్సిన నోటిఫికేషన్‌ను 2014లో ప్రకటించి, 2015లో ప్రవేశపరీక్ష నిర్వహించి, 2017లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ ఓయూలో పరిశోధనలంటేనే విద్యార్థులు విసుగెత్తే పరిస్థితి ఏర్పడింది.

విద్యార్థులకు సదుపాయాలు, మౌలిక వసతులూ అంతంత మాత్రమే ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ నిర్వహణను ఈ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది యూనివర్సిటీకే ఐకన్‌లా ఉండే ఆర్ట్స్ కాలేజీ బిల్డింగే కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. వర్షం వస్తే చాలా గదుల్లో నీళ్లు కారే పరిస్థితి నెలకొంది. ఆర్ట్స్ కాలేజీ ఇలా ఉంటే ఇతర భవనాల్లో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవడం కష్టమేమీ కాదు. హాస్టల్లో ఉండే విద్యార్థులకు రేకుల షెడ్డులే గతి. పూర్తిస్థాయి మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు చెంబులు పట్టుకొని ఆరు బయటే బహిర్భూమికి వెళ్తున్నారు. స్నానాలు బయటే చేయాల్సిన దుస్థితి. నగరం నడిబొడ్డున కొలువైన ఓయూలోనే ఇలా ఉంటే స్వచ్ఛ హైదరాబాద్ ఎలా సాధించగలం. నాణ్యమైన మానవ వనరులు లేకుండా పెట్టుబడులను ఆకర్షించలేమని టీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తిస్తే మంచిది.

**యూజీసీ నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచింగ్ ఫ్యాకల్టీ ఉండాలి. మౌలిక వసతులు మెరుగుపర్చాలి. పరిశోధనలను ప్రోత్సహించాలి. అప్పుడే యూనివర్సిటీలు ఆణిముత్యాల్లాంటి పౌరులను సమాజానికి అందించగలుగుతాయి. దేశానికీ మేలు కలుగుతుంది. ఇందుకు ఉస్మానియా శతాబ్ది వేడుకల నుంచే శ్రీకారం చుట్టాలి.**

సరైనా బోధనా సిబ్బంది లేకుండా అత్యున్నత విద్యాప్రమాణాలు ఎలా ఆశించగలం? ఇటీవల నిర్వహించిన కొన్ని సర్వే ఫలితాల్లో విస్తుపోయే విషయాలు వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రంలో ప్రొఫెషనల్ కోర్సు పూర్తి చేసిన వారిలో 70 శాతం పైగా అభ్యర్థులకు ఉద్యోగ సామర్థ్యం లేదని స్పష్టమైంది. పటిష్టమైన వ్యవస్థ, జవాబుదారీతనం గలిగిన సమర్థవంతమైన పాలన సామర్థ్యం, మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య లేకుండా విద్యార్థుల సామర్థ్యం ఎలా పెంపొందుతుంది? వృత్తి ఉద్యోగాల్లో ఎలా రాణించగలరు?

గతంలో ఉస్మానియాలో ఉన్నత విద్య నభ్యసించి ఎంతోమంది దేశవిదేశాల్లో అనేక రంగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. ఎంతోమంది శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారావేత్తలు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లను ఈ యూనివర్సిటీ దేశానికి అందించింది. ప్రధాన మంత్రి, మంత్రులతో పాటు ఎందరో రాజకీయ దురంధరులను తయారు చేసింది. ఓయూలో ఉన్నత విద్యనభ్యసించి అమెరికా, యూరప్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా వేరువేరు రంగాల్లో ప్రముఖ స్థానాల్లో పనిచేస్తున్నారు. ఓయూకు ఉద్యమ చైతన్యమూ ఎక్కువే. నాడు నిజాంను ఎదురించి వందేమాతరం అంటూ ఎలుగెత్తింది. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారింది. మలిదశ ఉద్యమంలో అత్యంత చురుకైన పాత్ర పోషించింది. ఇంతటి ప్రశస్తి పొందిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ పాలకుల అసమర్థత, నిర్లక్ష్యం, చేతకానితనం కారణంగా మసకబారుతోంది. ఈ పరిస్థితి మారాలి. ఉస్మానియా పునర్వైభవం సాధించాలి. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు దేశంలోనే కాదు ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల సరసన నిలవాలి.

ఉస్మానియాతో పాటు రాష్ట్రంలోని యూనివర్సిటీలో నాణ్యమైన విద్య అందించాలి. ఇందుకు యూజీసీ నిబంధనల ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచింగ్ ఫ్యాకల్టీ ఉండాలి. మౌలిక వసతులు మెరుగుపర్చాలి. పరిశోధనలను ప్రోత్సహించాలి. అప్పుడే యూనివర్సిటీలు ఆణిముత్యాల్లాంటి పౌరులను సమాజానికి అందించగలుగుతాయి. దేశానికీ మేలు కలుగుతుంది. ఇందుకు ఉస్మానియా శతాబ్ది వేడుకల నుంచే శ్రీకారం చుట్టాలి. లేకుంటే ఎన్నో ఉద్యమాలకు ఊపిరిలూదిన ఉస్మానియా యూనివర్సిటీ నుంచే ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, దాటవేత ధోరణికి, సవతి తల్లి ప్రేమకు వ్యతిరేకంగా మరో ఉద్యమం పురుడు పోసుకుంటుంది. ■




# ప్రతిభకే పద్మా పురస్కారం




యం. వెంకయ్యనాయుడు
కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

దేశం నడకను, నడతను గుణాత్మక మలుపు తిప్పిన సిసలైన సంస్కర్తలను సముచితంగా గౌరవించుకోవడం ప్రభుత్వాల గురుతర బాధ్యత. జాతి పురోభివృద్ధికి తోడ్పడిన మహనీయులను సత్కరించుకునే క్రమంలో రాజకీయాలకు ఏ కోశానా తావు లేదు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించే పురస్కారాలు, అవార్డులపై గతంలో ఎన్నో వాద వివాదాలు చెలరేగేవి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో ప్రస్తుతం అవార్డులు అసలైన ప్రతిభావంతులను కోరి వరిస్తున్నాయి! ఎలాంటి ప్రశ్నలకు, సందేహాలకు, అనుమానాలకు తావులేని రీతిలో అన్ని విధాలుగా అర్హులైన వ్యక్తులను ఏరి కోరి ఎంపిక చేసి పద్మ పురస్కారాలతో గౌరవించడమే అందుకు నిదర్శనం. గత ప్రభుత్వాల హయాంలో అవార్డుల ప్రక్రియ పక్కదోవ పట్టిన తీరు బహిరంగ రహస్యం. నాటి ప్రభుత్వాల తప్పులను, వాటి హయాంలో జరిగిన అవకతవకలను పక్కనపెడితే 62ఏళ్ల పద్మ అవార్డుల చరిత్రలో మునుపెన్నడూ కనీవినీ ఎరుగని స్థాయిలో నామినేషన్ల ప్రక్రియలో మోదీ ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రతిష్ఠాత్మక అవార్డుల కోసం నామినేషన్ల దాఖలు, వాటి వడపోత ప్రక్రియ మొత్తం అంతర్జాలం ద్వారా పూర్తి పారదర్శకంగా జరిగేట్లు జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంది. వీసమెత్తు సంశయానికీ తావులేకుండా పూర్తిగా నైపుణ్యానికి, ప్రతిభకు మాత్రమే పట్టం దక్కుతుందని మోదీ ప్రభుత్వం అందరికీ స్పష్టమైన సంకేతాలు పంపించింది. నిజంగా ఇది గణనీయ సంస్కరణ!


సిఫార్సులకు తలొగ్గి అర్హతలతో నిమిత్తం లేకుండా అవార్డులు కట్టబెట్టిన ఉదాహరణలు గతంలో కోకొల్లలు. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, సహాయ మంత్రులు, పార్లమెంటు సభ్యులు, అప్పటికే అవార్డులు పొందినవారు ప్రభుత్వాలకు సిఫార్సుల చిట్టా పంపించేవారు. తమకు కావలసినవారికి, అనుంగు సహచరులకు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేవారు. ఆ సంస్కృతికి నరేంద్ర మోదీ ప్రభుత్వం చరమగీతం పాడింది. అవార్డుల ఎంపికలో ఎవరి సిఫార్సులకు, ఒత్తిళ్లకు తావులేని వాతావరణం కల్పించింది. లోపాలకు చోటులేని రీతిలో నామినేషన్ల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా




సంకల్పం ఉంటే సాధించలేనిది లేదన్న విషయాన్ని నిరూపించిన దివ్యాంగ రైతు గనభాయ్ దర్గభాయ్ పటేల్ గుజరాత్‌లోని బనస్కంత జిల్లా వ్యవసాయ క్షేత్రాలను సస్యశ్యామలం చేశారు. తీవ్ర కరవు, దుర్భిక్షం బారినపడి కుములుతున్న ఆ జిల్లాను దానిమ్మ పంట ఉత్పత్తి కేంద్రంగా మలచిన కృషీవలుడాయన. జిల్లా రైతులకు బిందు సేద్యాన్ని, నూతన వ్యవసాయ విధానాలను పరిచయం చేసిన గనభాయ్ దానిమ్మ పంట ఉత్పత్తిలో అక్కడి రైతులను నిష్ణాతులుగా మలిచారు. 'అనార్ బాబా' (దానిమ్మ బాబా)గా విఖ్యాతి చెందిన గనభాయ్ కృషి కారణంగా ఆ జిల్లా నుంచి పశ్చిమాసియాకు సైతం నేడు దానిమ్మ పంట ఎగుమతి అవుతోంది.



విద్య ద్వారానే వికాసమన్న సత్యాన్ని గ్రహించిన విజయవాడకు చెందిన వి.కోటేశ్వరమ్మ బాలికా సాధికారత సాధనలో లెక్కలేనన్ని విజయాలు సాధించారు. మాంటిస్సోరి విద్యా సంస్థల డైరెక్టరైన కోటేశ్వరమ్మ 1955 నుంచీ బాలికలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్నారు. 1945లో విజయవాడ తాలూకాలో అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందిన తొలి మహిళ ఈమె. ప్రభుత్వం 1971లో కోటేశ్వరమ్మను జాతీయ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. సమాజంలోని ప్రతి ఒక్కరినీ విద్యాసంపన్నులుగా తీర్చిదిద్దాలన్న ఈమె తాపత్రయం జాతి జనులందరిలో స్ఫూర్తి నింపుతుందనడంలో సందేహం లేదు.



పదిమందిని కాపాడటం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పనిచేయడం కన్నా త్యాగమేముంటుంది? కోల్‌కతాకు చెందిన బిపన్ గణత్రా అదే కోవకు చెందిన మనీషి. కోల్‌కతా నగరంలో ఎక్కడ అగ్ని ప్రమాదం సంభవించినా, చెలరేగే జ్వాలలను చల్లార్చడంకోసం నేనున్నానంటూ స్వచ్ఛందంగా ముందుకు ఉరికిన బిపన్ గణత్రా సాహసం ఎన్నో వందల మంది ప్రాణాలను కాపాడింది. ఇప్పటివరకూ ఆయన వందకుపైగా అగ్నిమాపక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్పంచుకున్నారు. ఆ పని చేయడం కోసం అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రత్యేకంగా ఉన్నప్పటికీ సామాజిక సంక్షేమం పట్ల ఎనలేని ఆపేక్షతో స్వచ్ఛందంగా ఈయన చేసిన సేవ నిరుపమానమైనది.



మంచి చేయాలన్న తపనకు సరిహద్దులు లేవు. జాతీయ రహదారులపై ప్రమాదాల బారినపడినవారి దుస్థితిని చూసి చలించిన డాక్టర్ సుబ్రతో దాస్ ఏకంగా వారికోసం గుజరాత్‌లోని వదోదరలో 'లైఫ్‌లైన్ ఫౌండేషన్' స్థాపించారు. సేవా దృక్పథమే ప్రామాణికంగా అంతకంతకూ విస్తరించిన ఆయన సంస్థ ప్రస్తుతం దేశంలోని నాలుగు రాష్ట్రాల్లో రహదారి ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందిస్తోంది. 'హైవే మెసయ్య'గా పేరొందిన సుబ్రతో దాస్‌కు పద్మ పురస్కారం లభించడం సామాజిక సేవ పట్ల మరెందరిలోనో స్ఫూర్తి నింపే చర్య.



పొగిడితే మందహాసం చేసి, తిడితే మౌనం వహించువాడు ఉత్తముడు. – గాంధీ



చెట్టు బాగుంటే మనిషి బాగుంటాడన్నది నిత్య సత్యం! వాతావరణ మార్పులు, పర్యావరణంపై వాటి ప్రభావంపై శాస్త్రవేత్తలు, నిపుణులు గళం విప్పక ముందే చుట్టూ ఉన్న చెట్టూ చేమలపట్ల ఎనలేని బాధ్యత కనబరిచిన వ్యక్తి తెలంగాణలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దరిపల్లి రామయ్య. ఖాళీ చోటు కనిపిస్తే చాలు అక్కడ ఓ మొక్కనో లేదా విత్తనాన్నో నాటకుండా ముందుకు కదలని దరిపల్లి రామయ్యది నిస్వార్థ సేవా నిరతి. గడచిన నాలుగు దశాబ్దాలుగా కోటికిపైగా మొక్కలు నాటిన ఈ పర్యావరణ ప్రేమికుడు తెలంగాణలో పచ్చదనం విచ్చుకోవడానికి చేసిన కృషి అంతా ఇంతా కాదు.



ఎదుటివారి కష్టాన్ని గుర్తించాలంటే స్పందించే హృదయం ఉండాలి. తెలంగాణలోని పోచంపల్లి గ్రామంలో చేనేత మగ్గాలపై ఒక్కో చీర నేయడానికి గంటలకొద్దీ కష్టపడుతున్న అక్కడి తల్లుల కష్టాన్ని చూసి చలించిన చింతకింది మల్లేశం ఓ మేలైన ప్రత్యామ్నాయంతో ముందుకు వచ్చారు. తన చదువుకు సార్థకత చేకూరుస్తూ, పట్టు చీర నేతను అత్యంత సులభతరంగా మార్చే యంత్రం రూపొందించారు. ఎందరో చేనేతకారుల జీవితాల్లో వెలుగు నింపిన సృజనాత్మక నవకల్పనకు కారణమైన మల్లేశం దేశంలోని ఎందరో ఔత్సాహికవేత్తలకు కొత్త స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



శతాబ్దాల సంస్కృతీ సంపదను ముందు తరాలకు అంతే పొందికగా అందించాలంటే ఈ గడ్డమీద ఎంతో ప్రేమ ఉండాలి. మీనాక్షి గురుక్కల్‌కు అది కావలసినంత ఉంది. కేరళలో అత్యంత పురాతనమైన యుద్ధ క్రీడ కలరిపయట్టులో నిష్ణాతురాలైన 74 సంవత్సరాల మీనాక్షి అమ్మ దశాబ్దాలుగా వందలమంది బాలబాలికలకు ఆ కళలో తరీదు ఇస్తున్నారు. పురాతన యుద్ధకళపట్ల అపార ప్రేమాభిమానాలతో ఎవరి దగ్గరా పైసా తీసుకోకుండా దశాబ్దాలుగా శిక్షణ కొనసాగిస్తున్నారు. కేరళలో ఎంతోమంది బాలికలకు ఆత్మరక్షణ విద్య నేర్పించిన మీనాక్షి గురుక్కల్ ధన్యజీవి!



ఆరు దశాబ్దాలుగా ఏ మాత్రం ప్రతిఫలం ఆశించకుండా ఇండోర్‌లో పేదలందరికీ ప్రసూతి సేవలు అందిస్తున్న 91 ఏళ్ల డాక్టరమ్మ భక్తి యాదవ్ పదమందికీ స్ఫూర్తి ప్రదాత. పంజాబ్‌లో 165 కిలోమీటర్ల పొడవైన కాళిబెన్ నదికి కాలుష్యం నుంచి విముక్తి ప్రసాదించడంలో బాబా బల్బీర్ సింగ్ సీచెవాల్ అమోఘమైన కృషి చేశారు. చుట్టూ ఉన్నవారిని చైతన్యపరచి వారి అండదండలు కూడగట్టుకొని అతి తక్కువ ఖర్చుతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేసిన బల్బీర్ సింగ్ నిజమైన పర్యావరణ వాది.

మార్చిన తీరే అందుకు ఉదాహరణ. దాని ఫలితాలు ఇప్పుడు అందరికీ కనిపిస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వాల మాదిరిగా వందకు పైగా అవార్డులు ప్రకటించకుండా నిర్దుష్ట ప్రమాణాలను అనుసరించి వాటిని 89కి కుదించింది. మరీ ముఖ్యంగా జాతి ప్రధాన స్రవంతిలో సరైన గుర్తింపునకు నోచుకోని నిజమైన కథానాయకులను అన్వేషించి మరీ ఈ ప్రభుత్వం వారిని అవార్డులతో గౌరవించుకుంది. జీవిత పర్యంతం నిస్వార్థంగా కృషి చేసి, సంబంధిత రంగాల్లో తిరుగులేని స్థాయికి చేరుకొని, దేశ పునర్నిర్మాణానికి పాటుపడిన త్యాగధనులకే పద్మ పురస్కారాలు లభించాయి. 'సద్గురువు'గా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మికవేత్త జగ్గీ వాసుదేవ్‌ను పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించడం ఎంతో సముచితం. విభిన్న రంగాల్లో లబ్ధ ప్రతిష్ఠులుగా పేరెన్నికగన్న వారికి మునుపటి ప్రభుత్వాల హయాంలో సరైన గుర్తింపు లభించలేదన్నది కఠిన వాస్తవం. అవార్డులు ఆశిస్తున్నవారికి రాజకీయ పలుకుబడి ఉంటే అర్హులకు అప్పట్లో మొండిచెయ్యే మిగిలేది. 'సంస్కరణ, కార్యాచరణ, రూపాంతరీకరణ' లక్ష్యానికి కట్టుబడి మోదీ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో ముందుకు దూసుకుపోతోందిప్పుడు! విస్మృత కథానాయకులకు పద్మ పీఠాలు వేయడాన్ని మించి మోదీ ప్రభుత్వ నిబద్ధతకు మరో దాఖలా అవసరం లేదు.

'పురస్కారాల సాధనకు వీసమెత్తు అర్హత లేకపోయినా అడ్డదారుల్లో వాటిని దక్కించుకోవడం కన్నా సమస్త అర్హతలూ ఉండీ అవార్డులు పొందకుండా మిగిలిపోవడమే మిన్న' మార్క్ ట్వైన్ అనే అమెరికన్ రచయిత చేసిన వ్యంగ్య వ్యాఖ్య ఇది. ప్రతిభ, కఠోర పరిశ్రమ, నిబద్ధతలనే కచ్చితమైన మార్గనిర్దేశాలుగా మలచుకొని ప్రభుత్వం ఈసారి పద్మ అవార్డులను ప్రకటించిన తీరు నన్ను పరమానందపరచింది. జాతి పునర్నిర్మాణానికై అహరహం శ్రమిస్తూ ప్రజాజీవనంలో, పర్యావరణ పరిరక్షణలో మేలు మార్పులు సాధించిన సిసలైన సామాజిక ఉద్యమకారులను వెదికి పట్టుకోవడమే ప్రభుత్వం సాధించిన విజయం. పాక్ ఆక్రమిత కశ్మీరుపై లక్షిత దాడులు చేసి ఉగ్రవాద మూకలను మట్టుబెట్టిన వీర సైనికులను శౌర్య పతకాలతో సత్కరించడం దేశ ప్రజలను ఎనలేని ఆనందానికి గురిచేసింది. సమాజం పట్ల అచంచల ప్రేమాభిమానాలతో, పునాది స్థాయి మార్పులను లక్షించి కృషి చేసిన సంస్కర్తలకు పద్మ పురస్కారాలు లభించడం ఎంతైనా హర్షణీయం. కఠోర శ్రమ, నిబద్ధత ఎనలేని నిజాయతీ ఉంటే కొండంత లక్ష్యమైనా చిన్నదిగా మారుతుందనడానికి ఉదాహరణలు... ఇలాంటివారి స్ఫూర్తి గాథలు! లక్ష్యం నమున్నతమైనదైనప్పుడు, నిబద్ధత వంకపెట్టలేనిదైనప్పుడు ఒక వ్యక్తి సైతం సమాజంలో గణనీయం మార్పు తీసుకురాగలరనడానికి పద్మ పురస్కార గ్రహీతల జీవితాలే నిదర్శనం. దేశంలో పునాది స్థాయి మార్పుల కోసం ప్రధాని నరేంద్ర మోదీ కంకణబద్ధులై ముందుకు సాగుతున్నారు. దేశాభివృద్ధితో ముడివడిన అనేక అంశాలపై ప్రజల దృక్పథంలో మార్పు తీసుకురావాలన్నదే మోదీ సంకల్పం. పద్మ పురస్కారాల ఎంపికలో ప్రవేశపెట్టిన పారదర్శక విధానమే ప్రభుత్వ దృక్కోణం గుణాత్మకంగా మారుతోందనడానికి దాఖలా! ■

రాష్ట్రపర్వం



# దళితులను వంచిస్తున్న కేసీఆర్

• ప్రవీణ్

అధికారంలోకి వచ్చి సుమారు మూడు సంవత్సరాలు అవుతూఉండగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తనను 'దళిత వ్యతిరేకి'గా ప్రజలు భావిస్తున్నారని ఆలస్యంగా గ్రహించారు. ఈ ముద్రను చెరిపి వేసుకొనే ప్రయత్నాలలో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో రోజంతా తన అధికార నివాసంలో సమాలోచనలు జరిపారు. పొరపాట్లను సరిదిద్దుకొనే ప్రయత్నం ఏమాత్రం చేయకుండా, ఇకముందు 'మీరు చెప్పిందే' చేస్తాను అంటూ అరచేతిలో స్వర్గం చూపించే ప్రయత్నం చేశారు.

మాటల మాంత్రికుడు ముఖ్యమంత్రి ముందు ఉపప్రణాళిక నిధుల తరలింపు, అమలు కాకుండా మురిగిపోతున్న పలు పథకాల గురించి నిర్దిష్టమైన హామీల కోసం పట్టుబట్టకుండా అయన గొప్ప చొరవ తీసుకున్నరంటూ ప్రతిపక్ష నాయకులు సైతం పొగడ్తలతో వెనుదిరిగి వచ్చారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధ్యక్షతన ఎస్సీ ప్రజా ప్రతినిధులతో, చందూలాల్ అధ్యక్షతన ఎస్టీ ప్రజా ప్రతినిధులతో కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రభుత్వ కార్యక్రమాలను ఆ కమిటీలు నిర్ణయించి, ప్రతిపాదిస్తే తన ప్రభుత్వం అమలు జరుపుతుందని హామీ ఇచ్చారు.

చట్టబద్ధమైన ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేసే ప్రయత్నం చేయకుండా ఇటువంటి కమిటీల ఏర్పాటుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎస్సీ/ఎస్టీ ఉపప్రణాళిక నిధులకు సంబంధించిన బిల్‌ను శాసనసభ ఆమోదించింది. ఇంతవరకు ఆ నిధుల వ్యయానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలనే రూపొందించలేదు. పైగా ఆయా వర్గాలకు ఖర్చు పెట్టాల్సిన నిధులను ఇతరత్రా ఉదారంగా ఖర్చు పెడుతున్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆ విధంగా రూ.17,500

> **ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఎస్సీ/ఎస్టీ ఉపప్రణాళిక నిధులకు సంబంధించిన బిల్‌ను శాసనసభ ఆమోదించింది. ఇంతవరకు ఆ నిధుల వ్యయానికి సంబంధిచిన మార్గదర్శక సూత్రాలనే రూపొందించలేదు. పైగా ఆయా వర్గాలకు ఖర్చు పెట్టాల్సిన నిధులను ఇతరత్రా ఉదారంగా ఖర్చు పెడుతున్నారు.**

కోట్ల మేరకు నిధులను మళ్లించారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధినేత మంద కృష్ణ మాదిగ ఆరోపించారు.

రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలలో ఈ అంశంపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం నుండి నిర్దిష్టమైన ప్రకటన కానీ, ఇక ముందు ఆ విధంగా నిధులను మళ్లించబోమని హామీ కానీ రాకపోవడం గమనార్హం.

ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టం మేరకు నిధుల ఖర్చు జరగడం లేదు. బడ్జెట్ నిధులు లేకపోవడంతో ఆయా పనులన్నీ నిలిచి పోయాయి. ఆర్థికశాఖ నిధుల విడుదలకు ఆదేశాలిచ్చినా అవన్నీ కోశాగారాల్లో నిలిచిపోతున్నాయి. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నప్పటికీ ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు కనీసం 40 శాతం కూడా ఖర్చు కాలేదు. కేంద్ర బడ్జెట్ మార్గదర్శకాల మేరకు తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లోనూ ప్రణాళిక పద్దును తొలగించ నున్నారు. దాంతో క్యాపిటల్ నిధుల్లో జనాభా ప్రాతిపదికన కేటాయింపులు చేసేందుకు ఉప ప్రణాళిక చట్టసవరణకు ప్రభుత్వం సిద్ధపడుతున్నది.

## ఆగిపోయిన నిధుల కేటాయింపు

2016-17 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ ఉప ప్రణాళిక కింద రూ.10,483 కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళిక కింద రూ.6171 కోట్లు కేటాయించారు. ఇందులో కేంద్ర వాటా దాదాపు రూ.4వేల కోట్ల వరకు ఉంది. ఇప్పటి వరకు మూడు త్రైమాసికాలు ముగిసినందున కేటాయించిన మొత్తం నిధుల్లో 75 శాతం ఖర్చు కావాల్సి ఉండగా 40 శాతం కూడా ఖర్చు కాలేదు.

కేంద్రం వాటా మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వ వాటా కేటాయింపు, ఖర్చు అంతంత మాత్రంగానే ఉంది. ఉపప్రణాళిక నిధుల ఖర్చుపై ఇటీవల కేంద్ర మంత్రి ఆరా తీయగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికలోటు ఎదుర్కొంటోందని అధికారులు వివరించారు. ఇప్పటివరకు ఎస్సీ ఉపప్రణాళిక కింద రూ.4514కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళిక కింద దాదాపు రూ.2వేల కోట్లు మాత్రమే వెచ్చించారు.

ఉపప్రణాళిక కింద వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, విద్య, ఉపాధి తదితర అంశాలకు చేయాల్సిన ఖర్చు వివరాలను ఉపప్రణాళిక బడ్జెట్‌లో కేటాయించారు. ప్రభుత్వ విభాగాల నుంచి నిధుల విడుదలకు ఆదేశాలు ఇచ్చినా ఖర్చు మాత్రం జరగలేదు. పలు పథకాలకు సంబంధించి ఆర్థికశాఖ నిధులను నిలిపివేసింది.

ఎస్సీ ఉప ప్రణాళికలో వ్యవసాయశాఖ పనులకు నిధులు నిలిపివేశారు. రూ.202 కోట్ల స్థానంలో రూ.11.32 కోట్ల ఖర్చు జరిగింది. కేజీ టూ పీజీ గురుకులాల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. మురికివాడల అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు సంబంధిత స్థానిక సంస్థల ఖాతాల్లో సర్దుబాటు జరగలేదు.

మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా కోసం నిధుల ఖర్చు 50 శాతం దాటింది. పరిశ్రమల శాఖలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు, భూములకు అవసరమైన నిధుల ఖర్చు మరీ దారుణంగా ఉంది. దాదాపు రూ.130 కోట్లకు



కులం ఏదైనా మంచి పనులు చేసిన వారే ప్రసిద్ధులు, కీర్తిమంతులవుతారు. – ఠాగూర్

కేవలం రూ. 26 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

బలహీనవర్గాల గృహాల నిర్మాణానికి రూ. 238 కోట్లు కేటాయిస్తే అందులో ఒక్క రూపాయీ వెచ్చించలేదు. పాఠశాల విద్య, ఉద్యానశాఖ, పశుసంవర్ధకం, సూక్ష్మ నీటి పారుదల విభాగాల కింద 10 శాతం నిధులు కూడా ఖర్చు కాలేదు. గిరిజన ప్రాంతాల్లో తండాల అనుసంధాన రహదారుల నిర్మాణానికి నిధులు విడుదల కాలేదు.

### దళితులు, గిరిజనులపై దాడులు

మరోవైపు తెలంగాణలో దళితులు, గిరిజనులపై దాడులు పెరిగినట్లు ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద నమోదైన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దాడులతో పాటు హత్యలు, అత్యాచారాల వంటి కేసులు పెరిగినట్లు సూచిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ఫిర్యాదులతో పోలిస్తే 2016 నాటికి ఆ సంఖ్య భారీగా పెరిగింది. కేసుల విచారణలో జాప్యం కారణంగా బాధితులకు సరైన న్యాయం జరగడం లేదు. ఎస్సీ, ఎస్టీ వేధింపులు, అత్యాచార నిరోధక చట్టం పకడ్బందీగా అమలు చేయాల్సిన యంత్రాంగం వేగంగా స్పందించడం లేదు. ఈ కేసులపై రాష్ట్రస్థాయిలో

> **తెలంగాణలో దళితులు, గిరిజనులపై దాడులు పెరిగినట్లు ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద నమోదైన గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దాడులతో పాటు హత్యలు, అత్యాచారాల వంటి కేసులు పెరిగినట్లు సూచిస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం ఫిర్యాదులతో పోలిస్తే 2016 నాటికి ఆ సంఖ్య భారీగా పెరిగింది. కేసుల విచారణలో జాప్యం కారణంగా బాధితులకు సరైన న్యాయం జరగడం లేదు.**

ఉన్నతస్థాయి కమిటీ ఒక్కసారీ సమావేశం కాకపోవడం గమనార్హం. ఎక్కువ కేసుల్లో ఎఫ్ఐఆర్ పరిధి నుంచి అభియోగపత్రం వరకు వెళ్లడం లేదు. హత్యలు, దాడులు, అత్యాచారాలు జరిగిన పలు సందర్భాల్లో గ్రామాల్లోని పెద్దలు, రాజకీయ నాయకులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ రాజీ కుదుర్చుతున్నారు. కేసుల విచారణలో జాప్యం కారణంగా అప్పటి వరకున్న సాక్షులు తరచూ విచారణ భయంతో తప్పుకుంటున్నారు. గత మూడేళ్లలో దాదాపు 1418 కేసులు పోలీసు విచారణ దశలోనే ఉండటం గమనార్హం.

విచారణలో ఆలస్యం కారణంగా కేసుల్లో పడుతున్న శిక్షల సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. గత మూడేళ్లలో న్యాయస్థానాల పరిధిలో 1680 కేసుల విచారణ పెండింగ్‌లో ఉంది. ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద నమోదైన కేసులను సమీక్షించేందుకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ నియామకం తెలంగాణలో ఆలస్యమైంది. ఇటీవల కమిటీని పునర్నియమించారు. సాధారణంగా ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ ఏడాదిలో జనవరి, జూలైలో సమావేశమై బాధితులకు అందుతున్న సహాయాన్ని పరిశీలించాలి. కానీ ఇప్పటివరకు ఈ కమిటీ సమావేశం కాలేదు. ■



హైదరాబాద్ మైలార్‌దేవిపల్లి డివిజన్‌లో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అడికె జనార్ధన్, బి.ప్రతాప్ రెడ్డి, జె.రవి, అడికె రాజు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలు పద్మజా రెడ్డి, బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, కె.రాములు, పడాకుల బాలరాజు, పి.శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపర్వం



# రైతుల ఆత్మహత్యలు పట్టని టీఆర్ఎస్ ప్రభుత్వం!

• కృష్ణ చైతన్య

రైతులకు పంట రుణాలను రద్దుచేస్తామన్న హామీతో ఎన్నికల్లో గెలిచిన తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు అధికారంలోకి వచ్చి సుమారు మూడేళ్లు అవుతున్నా రైతుల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదు. రుణమాఫీ హామీనీ సక్రమంగా అమలు చేయలేదు. ఇప్పటివరకు రుణాలను రద్దు చేయనే లేదు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్నా మూడో విడత రద్దు కూడా చేపట్టలేదు.

టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో ఆందోళనకరరీతిలో పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలపై ఈ ప్రభుత్వం పట్టనట్టే వ్యవహరిస్తోంది. దేశంలో రైతుల ఆత్మహత్యలు తీవ్రంగా ఉన్నాయని, నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన ఏడు రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి. జాతీయ నేర రికార్డు బ్యూరో నివేదిక ప్రకారం రైతుల ఆత్మహత్యలలో దేశంలో మహారాష్ట్ర తరువాత తెలంగాణ రెండవ స్థానంలో ఉంది. 2014లో రాష్ట్రంలో 898 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా 2015లో 1400కు పెరిగాయి. వారిలో 42 మంది వ్యవసాయ కూలీలు కూడా ఉన్నారు. వారిలో 46.5 శాతం మంది, అంటే 632 మంది కేవలం అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

అనధికార అంచనాల ప్రకారం రెండున్నరేళ్ల టీఆర్ఎస్ పాలనలో మూడు వేలమందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ విషయమై ప్రభుత్వం నోరు మెదపటం లేదు. కనీసం ఆత్మహత్యలకు గురైన కుటుంబాలకు ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని సానుభూతి కూడా తెలపడం లేదు. ఆత్మహత్యలు చేసుకోకుండా రైతులకు భరోసా కల్పించడానికి కూడా ప్రయత్నం చేయడం లేదు. రాష్ట్రంలో అసలు రైతు ఆత్మహత్యలే జరగనట్టు వ్యవహరిస్తున్నారు.

పంట రుణాల రద్దుకు సంబంధించి మూడో విడత రుణాలను 'వెంటనే' చెల్లిస్తామని డిసెంబర్ 21న అసెంబ్లీలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అయితే ఆరు వారాలు అవుతున్నా ఇంతవరకు అటువంటి ప్రయత్నం చేయలేదు. పైగా రుణాల రద్దులో జరుగుతున్న జాప్యం కారణంగా బ్యాంకులకు చెల్లించవలసిన వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా ఆ విషయాన్ని బ్యాంకులకు చేరవేయలేదు. దీంతో బ్యాంకులు రైతుల నుండే వడ్డీలను వసూలు చేస్తున్నాయి.

ఇక దుర్భిక్ష ప్రాంతాలలో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.791 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. అయితే ఇంతవరకు ఆ మొత్తంలో ఒక రూపాయి కూడా రైతులకు చెల్లించనే లేదు. ఒకటి, రెండు రోజులలో చెల్లిస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన అనంతరం కూడా ముఖ్యమంత్రి అటువంటి ప్రయత్నం చేయకపోవడం గమనార్హం.

**రైతుల ఆత్మహత్యలలో దేశంలో మహారాష్ట్ర తరువాత తెలంగాణ రెండవ స్థానంలో ఉంది. 2014లో రాష్ట్రంలో 898 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా 2015లో 1400కు పెరిగాయి. వారిలో 42 మంది వ్యవసాయ కూలీలు కూడా ఉన్నారు. వారిలో 46.5 శాతం మంది, అంటే 632 మంది కేవలం అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడ్డారు.**

ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకం 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన'కు తగిన ప్రాచర్యం కల్పిండంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైంది.

ప్రభుత్వ నిర్లప్తత కారణంగా తెలంగాణలో బ్యాంకులు రైతులకు పంట రుణాలను సైతం సక్రమంగా అందించలేక పోతున్నాయి. గత రబీ సీజన్లో రూ.13 వేల కోట్ల రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా రూ.7,500 కోట్లకు మించి పంపిణీ చేయలేకపోయాయి. దాంతో ఈ సంవత్సరం మంచి వర్షాలు పడినా పంటల విస్తీర్ణం 25 శాతం మేరకు పడిపోయింది.

గత ఖరీఫ్ సీజన్లో సోయా, మక్కజొన్న, పప్పుగింజల పంటలకు మద్దతు ధరలు లభించక రైతులు నష్టపోతూ ఉంటే ప్రభుత్వం ఆదుకొనే ప్రయత్నం చేయలేదు. అంతకు ముందు పదేళ్లపాటు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడూ అదే ధోరణి కొనసాగుతున్నది. దాంతో వ్యవసాయ రంగంలో సంక్షోభం తీవ్రమవుతున్నది.

సాగునీటి పథకాల అంచనాలు పెంచి, వందలు, వేల కోట్ల రూపాయలను కాంట్రాక్టులకోసం ఖర్చు పెట్టడం పట్ల చూతువున్న శ్రద్ధను రైతుల సంక్షేమం, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చూపడం లేదు. వివిధ పథకాల కోసం లక్ష ఎకరాలకు పైగా సాగులో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారికీ న్యాయమైన పరిహారం, నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై తగిన శ్రద్ధ చూపడం లేదు.

ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను హైకోర్టు నిలిపి వేయడంతో, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భూసేకరణ పరిహారం, పునరావాసం చట్టం, 2013కు సవరణలు చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో ఒక చట్టం తీసుకొచ్చారు. కేంద్ర చట్టంలో ఉన్న అంశాలకు మెరుగైన సదుపాయాలు కల్పించవచ్చు గాని, వాటిని కుదిస్తూ ఒక రాష్ట్ర అసెంబ్లీ చట్టం చేయడం బహుశా దేశంలో ఇదే మొదటిసారి కావచ్చు. టీఆర్ఎస్ ప్రభుత్వం ధోరణి రైతుల జీవితాలను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టివేసేలా ఉంది. ■




# రుపాయికి కిలో బియ్యం ఎన్డీఏ పుణ్యమే

• మొలుగు రవీందర్


## లబ్ధిదారుడు భరించేది రూ.1
## రాష్ట్ర ప్రభుత్వం రాయితీ రూ.2
## మోదీ ప్రభుత్వం రాయితీ రూ.29.67

రూపాయికే కిలో బియ్యం. పేదవాడి కడుపు నింపుతోన్న ఈ పథకం మోదీ ప్రభుత్వం వరం. దేశ ప్రజలందరికీ ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పనిచేస్తోంది. అన్ని రాష్ట్రాల్లాగే తెలంగాణలోనూ ఈ పథకం కింద భారీగా నిధులు వెచ్చిస్తోంది. అయితే ఇక్కడి తెలంగాణ ప్రభుత్వం మాత్రం తామే రూపాయికి కిలో బియ్యం పథకం ప్రవేశ పెట్టినట్టు గొప్పలు చెప్పుకుంటోంది. పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని జనాన్ని నమ్మిస్తోంది. కానీ.. నిజానికి ఈ పథకానికి సింహ భాగం నిధుల్ని మోదీ ప్రభుత్వమే ఇస్తోంది. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా గొప్పలు చెప్పుకోవడం లేదు. పేదల సంక్షేమానికే అహర్నిశలు కృషి చేస్తోంది.

ప్రచారం కన్నా పేదల సంక్షేమానికే పెద్దపీట వేసే కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఆర్భాటాలు లేకుండా నిధుల్ని మంజూరు చేస్తూ ముందుకెళ్తోంది. ఇదే అదనుగా భావించిన టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం.. దీన్ని సొమ్ము చేసుకునేందుకు ఆరాటపడుతోంది. మోదీ ప్రభుత్వం ఇస్తున్న రాయితీల తొక్కిపెట్టి.. ఇదంతా తమ గొప్పతనమేనని ఫోజులు కొడుతోంది. వాస్తవానికి కేంద్రం నిధులందించకపోతే ఒక్క రూపాయికే కిలో బియ్యం పథకం కేసీఆర్ ప్రభుత్వం ఒక్క నెల రోజులు కూడా అందించలేకపోయేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ పథకం అమలులో రాష్ట్రానికి కొండంత అండ అందిస్తోంది కేంద్రం. పేదలకు ఇచ్చే సబ్సిడీ బియ్యంలో కిలోకి రూ.29.67 మోదీ ప్రభుత్వం ఇస్తోన్న రాయితీనే. రాష్ట్రం కేవలం రెండు రూపాయలు భరిస్తూ.. ప్రజల వద్ద ఫుల్ మార్కులు కొట్టేయాలని ప్రయత్నిస్తోంది. కానీ.. కేంద్రం మాత్రం ఈ పథకం అమలులో ఎక్కడా రాజకీయాలకు తావివ్వడం లేదు. పేదలు చల్లగా ఉంటే చాలనే ఒకే ఒక్క లక్ష్యంతో పని చేస్తోంది. ప్రజలకు మేలు చేసే ఈ పథకం నుంచి రాజకీయ లబ్ధి పొందాలన్న ఆరాటాన్ని ప్రదర్శించడం లేదు.







జాతీయ ఆహార భద్రతా పథకం 2015 అక్టోబర్ నుంచి తెలంగాణలో అమలవుతోంది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా నిధుల కొరత రానీయకుండా ఎన్డీఏ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా.. పేదలు ఎక్కడ ఉన్నా వారి క్షేమం కోసమే పరితపిస్తోంది. చిట్టచివర ఉన్న వ్యక్తికి మొదట న్యాయం జరగాలన్న అంత్యోదయ స్ఫూర్తితో ప్రతి నెలా.. ప్రతి కుటుంబానికి 35 కిలోల ఆహార ధాన్యాలను అందిస్తోంది. అంతర్రాష్ట్ర రవాణా, ఆహార ధాన్యాల రవాణా ఖర్చులను కేంద్రమే భరిస్తోంది. రేషన్ డీలర్లకు ఇచ్చే కమీషన్‌లో సగం వాటా ఎన్డీఏ ప్రభుత్వానిదే.



గతేడాది రాష్ట్రం కరువుతో అల్లాడిన సమయంలో ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా మారింది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు, కూలీలు నాలుగు మెతుకుల కోసం అల్లాడిన సమయంలో.. మోదీ ప్రభుత్వం ఈ పథకం అమలుకు శరవేగంగా నిధులు మంజూరు చేసింది. దీంతో.. కరువు కాలంలో కూడా పేదలు కడుపునిండా తినగలిగారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వ పెద్ద మనసుకు నిదర్శనం. ఐతే ఇంత చేసినా.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎక్కడా దీనిని ప్రస్తావించలేదు. పేదల ఆకలిని కూడా ఎందుకు రాజకీయం చేయాలనేదే బిజెపి ఉద్దేశం. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ విలువలకు తిలోదకాలిస్తూ.. డబ్బాలు కొట్టుకుంటోంది. పేదలకు రూపాయికే కిలో బియ్యం ఇస్తున్నామంటూ గొప్పలకు పోతోంది.

ఈ పథకం లాగే తెలంగాణలో ఇంకా ఎన్నో పథకాలకు కేంద్రమే నిధులందిస్తోంది. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఎక్కడా ఎన్డీయే పేరెత్తదు. ఎందుకంటే.. ప్రభుత్వ పథకాలను రాజకీయంగా సొమ్ము చేసుకోవడమే వారికి కావాలి. రాజకీయ పార్టీలు రాజకీయాలు చేయడంలో తప్పులేదు. అయితే దానికీ ఓ హద్దుండాలి. మంచి పని ఎవరు చేసినా.. వారిని గుర్తించాలి. అప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. ■




# మోదీ "ఘన తంత్రం"

• రాకా

నీ గొప్ప నీకు తెలియాలంటే నీ శత్రువు ఏడుపును, అసూయను చూడమని చెబుతారు. దేశానికి విదేశీ నేతలు రావడం జరుగుతూనే ఉంటుంది. కరచాలనాలు, గ్రూప్ ఫోటోలు, స్వాగత వందనాలు, శతఘ్నుల మోతలు, కలిసి విందులు, సంయుక్త ప్రకటనలు... ఇవన్నీ జరుగుతూనే ఉంటాయి. కానీ ఈ పర్యటనల గురించి సాధారణ ప్రజానీకం పెద్దగా పట్టించుకోరు.

కానీ ఇలాంటి పర్యటనల్ని, ఫోటో ఆపర్చునిటీలను మన పొరుగు దేశం పాకిస్థాన్ వేయి కళ్లతో చూస్తూ ఉంటుంది. ఆత్రంగా అధ్యయనం చేస్తుంది. విశేషంగా విశ్లేషిస్తూ ఉంటుంది. ఇటీవల అబుధాబీ యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారతదేశానికి వచ్చారు. ఆయన మన గణతంత్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతేకాదు అబుధాబీ సైన్యం భారత రిపబ్లిక్ దినోత్సవ కవాతులో పాల్గొంది. గతేడాది ఫ్రెంచ్ సేన పాల్గొంది. ఈ ఏడాది ముస్లిం దేశం అబుధాబీ సైన్యం పాల్గొంది. వీటిని మనం పెద్దగా పట్టించుకోం.

కానీ పాకిస్థాన్ ఈ దృశ్యాన్ని చూసి కుళ్లికుళ్లి ఏడ్చింది. పాక్ టీవీలు గావు కేకలు పెట్టాయి. వ్యాఖ్యాతలు దాదాపు ఏడ్చినంత పనిచేశారు. పాక్ ప్రభుత్వం కంగారు పడిపోయింది. కలవరపడిపోయింది. ఒక ముస్లిం దేశం ప్రధాన నేత భారత్ రిపబ్లిక్ డే పరేడ్‌లో అతిథిగా పాల్గొనడం పాకిస్థాన్‌కి మింగుడు పడటం లేదు.

గతేడాది మోదీ ఆ దేశంలో పర్యటించినప్పుడు మోదీకి ఆ దేశపు అత్యున్నత పౌర పురస్కారం కింగ్ అబ్దుల్ అజీజ్ ఆర్డర్‌ను ప్రదానం చేశారు. పాకిస్థాన్‌కి ఈ గౌరవం ఏనాడూ దక్కలేదు. ఏ పాక్ దేశాధినేతకూ ఈ పురస్కారం ఇవ్వలేదు. మోదీ అక్కడ పర్యటించినప్పుడు ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి దేశాధినేత స్వయంగా విమానాశ్రయంలో మోదీకి స్వాగతం పలికారు. అంతకు కొన్ని రోజుల ముందు పాక్ అత్యున్నత అధికారులు అబుధాబీలో పర్యటించినప్పుడు అక్కడి ప్రభుత్వం వారిని తమ తమ ఫైళ్లు పుచ్చుకుని బయట నిలబెట్టింది. అంటే గల్ఫ్ ముస్లిం దేశాలు భారత్‌కు చేరువవుతున్నాయి. మరో మాట చెప్పాలంటే పాకిస్థాన్‌కు దూరమవుతున్నాయి.

పాకిస్థాన్ ప్రపంచంలోని ముస్లిం దేశాలన్నిటికీ నాయకత్వం వహించాలనుకుంటోంది. ఈ ఉద్దేశ్యంతోనే ప్రపంచ ముస్లిం దేశాల సమాఖ్యను ప్రారంభించింది. చాలాకాలం వరకూ ముస్లిం దేశాలు పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించాయి. పాక్ సమర్థిత తాలిబాన్‌ను గుర్తించిన మూడు దేశాల్లో సౌదీ అరేబియా ఒకటి. కానీ ఇప్పుడు సౌదీ భారత్‌తో చెలిమికి తహతహలాడుతోంది.

సౌదీ – భారత ద్వైపాక్షిక వాణిజ్యం 39.4 బిలియన్ల డాలర్లుంటే పాకిస్థాన్‌తో 6.1 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. చమురు కొనుగోళ్ల విషయంలో సౌదీ అరేబియాకు భారత్ అతిపెద్ద కస్టమర్. అదేవిధంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భారతదేశంలోని పదవ అతిపెద్ద పెట్టుబడి పెట్టే దేశం. యుఏఇ 3.01 బిలియన్ డాలర్ల పెట్టుబడులు భారత్‌లో పెట్టింది.

ఇక అబూధాబీ తొలిసారి హిందువుల కోసం మందిర నిర్మాణానికి భూమిని కేటాయించింది. ఇవన్నీ భారత-గల్ఫ్ సంబంధాల మెరుగుదలకు అద్దం పడుతున్నాయి. మోదీ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ఇది వేగవంతమైంది. మోదీ స్వయంగా యుఏఈ, అబుదాబీ, సౌదీలలో పర్యటించారు. షాంఘై సహకార సంస్థ సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడితో సమావేశమయ్యారు. భారత రాష్ట్రపతి బహ్రేయిన్, ఇజ్రాయిల్, జోర్డన్, పాలస్తీనాలో పర్యటించారు. మన విదేశ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ బహ్రేయిన్, ఇజ్రాయిల్, జోర్డన్, పాలస్తీనా, ఒమాన్, యుఏఈలలో పర్యటించారు. ఇటీవలి కాలంలో ఆమె అరబ్ ఇండియా సహకార ఫోరమ్ సమావేశంలో పాల్గొన్నారు. కతార్, అబుదాబీ, బహ్రేయిన్, ఇరాన్, ఒమాన్, సౌదీ, సిరియా, యుఏఈల అత్యున్నత స్థాయి నేతలు భారత్‌లో పర్యటించారు. ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కూడా భారత్‌లో పర్యటించారు.

వీటన్నిటి కొనసాగింపుగానే రిపబ్లిక్ డే పరేడ్‌లో మోదీ ఘనతంత్రాన్ని అమలు చేశారు. పాకిస్థాన్ కంగారు పడటానికి కారణం ఇదే. ■



జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళ్రావ్ నగర్‌లోని లక్ష్మీనగర్‌లో జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు అట్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# టీఆర్ఎస్ వైఫల్యాలపై ఉద్యమిద్దాం!

2019లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడానికి పార్టీ శ్రేణులు విశేష కృషి చేయాలని బిజెపి జాతీయ సంస్థాగత సహసంఘటనా ప్రధాన కార్యదర్శి వి.సతీష్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ హామీలను నెరవేర్చడంలో పూర్తి వైఫల్యం చెందిందని పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు మూడురోజులు పర్యటించిన సతీష్ వివిధ జిల్లాల, మండలాల, బూత్ కమిటీల సమావేశాలలో పాల్గొన్నారు. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను సమీక్షించారు.

జనవరి 31న జనగామ జిల్లా కోర్ కమిటీ, జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండల కార్యవర్గ సమావేశంలో, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకాల్ గ్రామంలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

రెండో రోజు రాష్ట్ర కార్యాలయంలో చేతివృత్తుల వారితో, వివిధ రాష్ట్రస్థాయి కమిటీలతో, పార్టీ అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు. మూడో రోజు నాచారంలోని మానసిక వికలాంగుల విద్యార్థుల సంస్థను సందర్శించారు. అనంతరం రాష్ట్ర పదాధికారుల సమావేశంలో, బిజెపి రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ పర్యటనలో భాగంగా పోలింగ్ బూత్, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉన్న కార్యకర్తలతో ఆయన వేరువేరుగా సమావేశమయ్యారు. జాతీయ పార్టీ విధానాలను, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యల గురించి కార్యకర్తలు, నాయకులకు సూచనలు ఇచ్చారు. బూత్ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు రాష్ట్రంలోని సమస్యలు, పార్టీ పటిష్టత కోసం జాతీయ పార్టీ తీసుకోవాల్సిన చర్యల గురించి వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలు, సలహాలు స్వీకరించారు.

కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేపట్టిన జన్‌ధన్ యోజన, ముద్రా యోజన, గృహ నిర్మాణం, వంటగ్యాస్, బీమా పథకాలు, రైతుల కోసం ఫసల్ బీమా యోజన, యువత కోసం స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, మహిళా, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం స్టాండప్ ఇండియా పథకాలపై ప్రచారం చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, టీఆర్ఎస్ ఎన్నికల ముందు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ తదితర హామీలు అమలుకాకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కార్యకర్తలు ఆయనకు వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద నోట్ల రద్దు నిర్ణయానికి సామాన్య ప్రజల నుంచి విశేష మద్దతు వస్తుందని తెలిపారు.

వి.సతీష్ మూడు పర్యటనలో భాగంగా జరిగిన కార్యక్రమాల్లో కొన్నింటిలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ సహా రాష్ట్ర బిజెపి నాయకులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జాతీయ పార్టీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నందనడానికి వి.సతీష్ తాజా పర్యటన రుజువు చేస్తుంది.

–జనసందేశ్ ప్రతినిధి

## గమనిక

**సోషల్ మీడియా ద్వారా బిజెపి తెలంగాణ కార్యకర్తలకు మరింత చేరువైంది. ఫేస్‌బుక్‌లో బిజెపి తెలంగాణ అఫీషియల్ పేజ్**

**https://www.facebook.com/BJP4Telangana**

**ను లైక్ కొట్టండి.**

**ట్విట్టర్‌లో బిజెపి తెలంగాణ అఫీషియల్ అకౌంట్**

**https://twitter.com/BJP4Telangana**

**ను ఫాలో అవ్వండి.**

**బిజెపి తెలంగాణ అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ అఫీషియల్ ఫేస్‌బుక్ పేజ్**

**https://www.facebook.com/DrKLaxman**

**అఫీషియల్ ట్విటర్ అకౌంట్**

**https://twitter.com/drlaxmanbjp**

**ను ఫాలో అవ్వండి.**

**సమకాలీన విషయాలపై పార్టీ విధానం, పార్టీ మరియు అగ్రనేతల సందేశం, భవిష్యత్ కార్యక్రమాలు తదితర సమాచారాన్ని కార్యకర్తలు మొబైల్ ఫోను, కంప్యూటర్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.**




# మారనున్న దేశ ఆర్థిక ముఖచిత్రం

కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన బడ్జెట్ ప్రవేశపెట్టిందని, అభివృద్ధి దిశగా దేశం ముందడుగు వేసేందుకు దోహదపడుతుందని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్ రావు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 4న హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర బడ్జెట్ తీరుతెన్నులపై పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రాబోయే రోజుల్లో వ్యవస్థలో మార్పునకు పునాదులు వేసే అంశాలు కేంద్ర బడ్జెట్‌లో ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారత ఆర్థిక ముఖచిత్రంలో రాజకీయాలకు అతీతంగా తీవ్రపరిణామాలు చోటుచేసుకునేలా ఉందని తెలిపారు. క్రియాశీలక వ్యవస్థకు, సామాజిక న్యాయానికి ప్రస్తుత తరుణంలో సంస్కరణలు అవసరమని అన్నారు. ఆర్థిక ఫలాలు బడుగు వర్గాలకు అందాలన్నదే బడ్జెట్ ఉద్దేశమని పేర్కొన్నారు.

రానున్న రోజుల్లో అన్ని రంగాలు కుదుటపడేందుకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందని, ప్రధానంగా నిర్మాణ రంగం తిరిగి కోలుకుంటుందని అన్నారు. రైతులకు బాసటగా ఈ బడ్జెట్ నిలుస్తుందని, బీసీ, ఎస్సీ, ఎస్టీల




సంక్షేమానికి పెద్దపీట వేశారని అన్నారు. గ్రామీణ, వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిరుటి కంటే రూ.48వేల కోట్లు కేటాయించారని, దీని ద్వారా కరవు ప్రాంతాల్లో ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయ రుణాలకు రూ.10 లక్షల కోట్లు కేటాయించడం చారిత్రాత్మకమని చెప్పారు. నైపుణ్యాభివృద్ధికి రూ.4వేల కోట్లతో సంకల్పనిధి ఏర్పాటు చేయడంతో ఉపాధి శిక్షణ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. తెలంగాణలో వివిధ రంగాలకు సైతం పెద్ద ఎత్తున కేంద్రం నిధులు కేటాయించిందని మురళీధర్ రావు చెప్పారు. ఫ్లోరైడ్ నియంత్రణకు రూ.1600 కోట్లు కేటాయించారని, ఉపాధి కల్పనకు రూ.2145 కోట్లు, హైదరాబాద్‌లో అభివృద్ధి కల్పనకు రూ.284 కోట్లు కేటాయించారని, విజ్ఞాన సంస్థలు, ఐఐటిలకు రూ.162 కోట్లు కేటాయించారని తెలిపారు. పెద్ద నోట్ల రద్దుతో బ్యాంకుల్లోకి వచ్చిన రూ.14 లక్షల కోట్ల పైచిలుకు డబ్బంతా వైట్‌మనీ కాదని, ఇందులోంచి పన్ను కట్టని వారిని గుర్తించే ఏర్పాటు వల్ల ప్రభుత్వానికి డబ్బు వచ్చి తీరుతుందన్నారు. దేశంలో రాజకీయాల ప్రక్షాళన దిశగా బిజెపి ముందుకు వెళుతోందని, ఇది తమ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు.

తెలంగాణలోనూ రాబోయే రోజుల్లో బిజెపిదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి రహిత ప్రభుత్వాన్ని బిజెపి ఇవ్వగలదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లోగా దేశంలో భారీగా మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనతను మోదీ ప్రభుత్వం సాధిస్తుందన్నారు.

–జనసందేశ్ ప్రతినిధి


## జనసందేశ్ చందాదారులుగా చేరండి..!

## జాతీయవాద ఉద్యమంలో భాగస్వాములు అవండి!

## చందా వివరాలు

పేరు:..............................................................................................

చిరునామా:........................................................................................

..........................................................................................................

.................................................. పిన్:...........................................

ఫోన్:..........................................మొబైల్:..............................................

ఈ-మెయిల్:........................................................................................

సంవత్సరం చందా రూ.200 ■ * 3 సంవత్సరాల చందా రూ.500 ■

నోట్: *డీడీ/చెక్‌లు జనసందేశ్ పేరుపై పంపించాలి.
*పూర్తి వివరాలతో మనీ ఆర్డర్ కూడా చేయవచ్చు.
*నేరుగా నగదు చెల్లించాలనుకునేవారు కార్యాలయంలో చెల్లించాలి.

చందాదారు సంతకం

సాహిత్య, రాజకీయ పక్షపత్రిక
జనసందేశ్
జాతీయ చైతన్య స్వరం

మీరు చెక్/డీడీ/మనీ ఆర్డర్ పంపించాల్సిన చిరునామా:
జనసందేశ్
డా॥ శ్యామా ప్రసాద్ ముఖర్జీ భవన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా, నాంపల్లి, హైదరాబాద్ – 500001.
ఫోన్: 040-24650866




తత్త్వజ్ఞానం శ్రేష్ఠమైనదే అయినా జీవితంలో దాని సాక్షాత్కారం లేకపోతే నిరుపయోగం. – దత్తోపంత్ ఠేంగ్డేజీ